


మా సిబ్బందంటే.. మా సిబ్బంది

పెరిగిన పని ఒత్తిడి కారణంగా ఎవరికి వారు వీఆర్వోలు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ విధులు అప్పగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు రెండుచోట్లా విధులకు హాజరుకాలేక సతమతమవుతున్నారు. అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా శాఖల మధ్య సమన్వయం లోపించడానికి, వారి మధ్య వివాదాలకు కారణమైంది. దాంతో క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్వోలు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక, సకాలంలో పనులు చేయలేక ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నారు. అనేక మండలాల్లో లక్ష్యాలను పూర్తిచేయలేదని అధికారులు చార్జీమెమోలను కూడా ఇచ్చారు. ఇప్పటికే పదుల సంఖ్యలో అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కత్తి మీద సామే!

» రెండుశాఖల మధ్య సమన్వయలోపం » జిల్లాలో తహసీల్దార్,ఎంపీడీవోల మధ్య పెరుగుతున్న దూరం

- లక్ష్యాలను విధించి కిందిస్థాయి ఉద్యోగులపై భారం
- ఎన్నికల విధులు, హౌస్‌హోల్డ్ సర్వే పనుల్లో గందరగోళం
- ఉత్తర్వులు ఫాలో కావాలంటూ ఒత్తిళ్లు
- చార్జి మెమోలతో బెదిరింపులు
- ఆందోళనలో వీఆర్వోలు
- ఇప్పటికే పదుల సంఖ్యలో ఆస్పత్రుల పాలు
- గత వైసీపీ సర్కారు తీరే ఈ పరిస్థితికి ప్రధాన కారణం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసేది వీఆర్వోలే. కాగా మండల స్థాయిలో అధికారులు సచివాలయ వీఆర్వోలతోపాటు సాధారణ వీఆర్వోలను ఎడాపెడా వాడేస్తున్నారు. వీఆర్వోలకు జాబ్‌చార్టు ఉన్నా అందుకు భిన్నంగా అన్ని శాఖలు వారిపై భారాలు మోపుతూనే ఉన్నాయి. రికార్డుల నిర్వహణ నుంచి అప్‌డేషన్ వరకు, పాస్ బుక్కులు, ఎఫ్‌ఎంసీ వంటి అనేక దరఖాస్తులను పరిశీలించడం వంటి విధులన్నీ వీఆర్వోలే నిర్వహిస్తారు. కార్యాలయంలో ఉండటంతో క్షేత్రస్థాయిలోనూ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాబ్‌చార్టుకు అదనంగా ప్రొటోకాల్, ఎన్నికల డ్యూటీలు, హౌస్‌హోల్డ్ సర్వే, జియో ట్యాగింగ్‌తోపాటు ప్రస్తుతం ఎన్నికల విధులు తప్పనిసరి కావడంతో ఓటర్ల దరఖాస్తులు పరిశీలన కూడా చేపట్టాల్సి ఉంది. మరోవైపు సాగు నీటి సంఘాల ఎన్నికల సమయం కావడంతో అందుకు సంబంధించిన ఓటర్ల జాబితాలను కూడా వీఆర్వోలే చేపట్టాల్సి ఉంది.

> ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కిందిస్థాయి సిబ్బందికి శాపంగా మారింది. కొందరు అధికారుల తీరుతో వారికి ఉద్యోగం కత్తిమీద సాములా తయారైంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో) ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకు భారం పెడుతుండటమే అందుకు కారణం. ప్రతి శాఖ అధికారులు ఆయా పనులపై వీఆర్వోలను పురమాయించడం, ఆపై ఒత్తిడి పెంచుతుండటంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. పైగా లక్ష్యాలను విధిస్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. పలువురు ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నాయి.



వైసీపీ ప్రభుత్వ పాపమే..

ప్రస్తుత సమస్యకు ప్రధాన కారణం గత వైసీపీ ప్రభుత్వమే. వీఆర్వోల విధులు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నా సచివాలయం ఏర్పాటు తర్వాత వారితోపాటే వీరి వేతనాలు కూడా ఎంపీడీవోలు ఇచ్చేలా మార్పులు చేసింది. రెండూ ప్రభుత్వ శాఖలే కావడంతో వారి మధ్య అధికార పోరు లేకుండా సమన్వయంతో పనిచేస్తే అంత సమస్య ఉండేది కాదు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అనాలోచిత కారణంగా ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో చిచ్చురేపింది. ప్రస్తుతం అంతా ఓటర్ల జాబితా తయారీలో బీజీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీఆర్వోలే బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు)గా ఉండటంతో ఆ పనులను సకాలంలో చేయాల్సి ఉంది. ఇంకొకవైపు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాల రూపకల్పనతోపాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని వెలికితీసేందుకు రీసర్వే, ఫ్రీహోల్డ్ భూముల విచారణను కూడా చేపట్టాల్సి ఉంది.

ఎంపీడీవో పరిధిలో వేతనాలు

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధం చేసి పంపే అధికారం తహసీల్దార్లకే ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవహారంలో తీవ్ర గందరగోళం నెలకొంది. వీఆర్వోల వేతనాలు వేసే అధికారం ఎంపీడీవోలకు అప్పగించారు. ఇక్కడ మరో మెలిక కూడా ఉంది. వీఆర్వోలలో గ్రేడ్-1, 2 అంటూ రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్వోలను గ్రేడ్-1 కింద ఉంచి వారికి వేతనం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్ధతిలోనే ఉంచారు. వీఆర్ఏలుగా పనిచేస్తూ ప్రమోషన్లపై వచ్చిన వీఆర్వోలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీవోలు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అటు సచివాలయాల్లోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికి ఎంపీడీవోలే వేతన బిల్లులు పంపాల్సి ఉంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు.

మానసికంగా ఇబ్బందులు

ఒకవైపు తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్లాలని ఆదేశాలు ఇస్తుంటే మరోవైపు ఎంపీడీవోలు మాకు తెలియకుండా మీఇష్టం వచ్చినట్లు వెళ్లిపోతే ఎలా అంటూ చార్జీమెమోలు ఇస్తున్నారు. ప్రస్తుతం వేతనాలు ఎంపీడీవోలు ఇస్తుండటంతో వాటిని నిలిపివేస్తే పరిస్థితి ఏమిటో అర్థం కాక సతమతమవుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీవోల మధ్య ఏర్పడుతున్న సమన్వయలోపంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. రెండు శాఖల మధ్య నెలకొన్న సమస్యలతో జిల్లాలో పదుల సంఖ్యలో పని ఒత్తిడి పెరిగి మానసికంగా ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల్లో చేరిన

మిగతా 6లో...



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట, పక్కన కలెక్టర్ అన్సారియా, బాలాజీ

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు

- అనేక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు
- ఒంగోలు ఎంపీ మాగుంట
- ఘనంగా మత్స్యకార దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమంతోపాటు వారి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమంతోపాటు వారి

మిగతా 6లో...

ఓ విద్యార్థీ.. మేలుకో!



నిత్యం శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసులు విద్యాలయాల్లో గురువులుగా మారారు. విద్యాబుద్ధులతోపాటు సమాజ శ్రేయస్సుకు దోహదపడే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల అనర్థాల గురించి వివరిస్తున్నారు.

7

మంత్రి ఆదేశించినా మారలేదు..!

వీల్‌చైర్ లేకపోవడంతో కర్రసాయంతో మెట్లు ఎక్కుతున్న రోగి



- జీజీహెచ్‌లో పారిశుధ్యం అధ్వానం
- వార్డులో నీరు కరువు, తాగునీటికీ తిప్పలు
- నేతల ఆదేశాలు పట్టించుకోని వైద్యులు, సిబ్బంది
- మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటించి నెల దాటింది

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)కు నిర్లక్ష్యపు జబ్బు చేసింది. స్వయంగా మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆకస్మికంగా పర్యటించి తనిఖీ చేసినా, సిబ్బందిలో మార్పు కనిపించడం లేదు. నేతల తనిఖీల్లో గురించిన వాటిపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి పనితీరు మార్చుకోవాలని హెచ్చరికలు జారీచేశారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, సిబ్బంది మధ్య సమన్వయం కలిగి ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించినా నేటికీ తీరు మారలేదు. వార్డులో కంపు, రూముల్లో నీటి కరువు, పనిచేయని లిఫ్టులు, పారిశుధ్యం సమస్యలు అలాగే ఉన్నాయి. నేటికి జీజీహెచ్‌లో అధికారుల నుంచి అటెండర్ వరకు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తుండగా, విధులకు వచ్చామా.. పోయామా.. అన్నట్లు సిబ్బంది పని తీరు నెలకొంది. దీంతో పేదలకు పూర్తి వైద్యం గగనంగా మారింది. రోగులకు వైద్యం సంగతి దేవుడెరుగు జీజీహెచ్‌కు చేసిన రోగానికి మందు లభించని పరిస్థితి ఉందని పలువురు రోగులు పెదవి విరుస్తున్నారు.

మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటించి నెల గడిచినా...

గతనెల 17న సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అలాగే అక్కడి సౌకర్యాలు, పారిశుధ్యం తదితర సమస్యలను నేరుగా పరిశీలించారు. అక్కడ నెలకొన్న దుర్భర పరిస్థితులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, సిబ్బంది సమన్వయం కలిగి ఉండాలని, అలాగే రోగుల పట్ల బాధ్యత, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అది జరిగి నెలరోజులైనా నేటికీ ఎలాంటి మార్పు లేదు. నేతలు, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం జీజీహెచ్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదంటే ఇక పేద రోగులను ఏం విధంగా చూస్తారో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రిమ్స్ ఆవరణలో మెడికల్ వ్యర్థాల బస్తాలు

కనిపించని మార్పు.. ఎక్కడి సమస్యలు అక్కడే

జిల్లాలో ఏకైక పేదల పెద్దాసుపత్రి ఒంగోలులోని జీజీహెచ్. ఇక్కడకు ప్రతి రోజూ సుమారు 2వేల వరకు రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతుండగా, అందులో సుమారు 400మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతుంటారు. కాగా వారికి వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు వచ్చామా.. పోయామా అన్నట్లు వ్యవహరిస్తుండటంపై రోగులు ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు వార్డులో కనీసం నీటి సౌకర్యం లేకపోగా, మరోవైపు గొంతు తడుపుకొనేందుకు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు

మిగతా 6లో...

అడుగుకో గుంత

టంగుటూరు గ్రామంలో ప్రధానమైన కొండపి రోడ్డు గుంతలమయంగా మారింది. ఈరోడ్డు నుంచే మండల కార్యాలయాల సముదాయం, గ్యాస్ ఆఫీస్, స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, యూనియన్ బ్యాంకు కొత్త బ్రాంచ్, పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆఫీస్‌లు, పొగాకు కంపెనీలకు వెళ్లాల్సి ఉంటుంది. అంతేగాక కొండపి, మర్రిపూడి మండలాలకు వెళ్లాలన్నా ఈ రోడ్డే ఆధారం. ఇంతటి ప్రధానమైన రోడ్డును ఆరేడేళ్ల నుంచి పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రోడ్డు ఏటేటికి దారుణంగా తయారైంది. ఇటీవల వర్షాలతో ఆ గుంతలు మరింత పెద్దవై వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-టంగుటూరు



గుంతలను తప్పించుకుంటూ వెళ్తున్న వాహన చోదకులు

కొండపి రోడ్డంతా గుంతలమయం



వెనుకబడిన ప్రాంత నిధులు విడుదల చేయాలి

శాసనసభలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

ఒంగోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను ప్రకటించిన నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి ఇచ్చే రూ.50కోట్ల నిధులను తక్షణం విడుదల చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం శాసనసభ జీరో అవర్‌లో ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తావించారు. పునర్విభజనలో భాగంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాలను కేంద్రం వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించి నిధులు ఇచ్చిన కేంద్రం.. రాయలసీమ తరహాలో కరువు, ఉత్తరాంధ్ర తరహాలో తుఫాన్ల ప్రభావం ఉండే ప్రకాశంను తొలిజాబితాలో విస్మరించిందన్నారు. దీనిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఈ ఆర్థిక సంవత్సరంలోనే వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశాన్ని కూడా చేర్పించడంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారని, అందుకు జిల్లా ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి ఇచ్చే రూ.50 కోట్లు నిధులను వెంటనే ఇవ్వాలని కోరారు. అదే సమయంలో వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించిన జిల్లాలకు కనీసం పదేళ్లపాటు ఈ తరహా నిధులు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సూచనలను పరిగణనలోకి తీసుకొని జిల్లాకు ప్రస్తుత ఏడాది నిధులతోపాటు పాతవి మొత్తం రూ.350 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆ నిధులు కూడా వచ్చేలా చూడాలని కోరారు. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ ప్రస్తుత ఏడాది రూ.50కోట్లు విడుదలకు చర్యలు తీసుకుంటామని, అలాగే పెండింగ్ నిధుల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే విజయకుమార్



నూజెండ్లపల్లిలో చెరువు తొట్టి భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఆక్రమిత భూముల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లి పంచాయతీలో ఉన్న చెరువుతొట్టి భూమిని కొందరు ఆక్రమించి సాగుచేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం 'భూమి హాంఫట్' శీర్షికన అంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్పందించారు. ఆక్రమణకు గురైన భూములపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వటంతో వెంటనే ఆర్ఐ పీవీ ఎస్ఆర్ మూర్తి, ఇన్‌చార్జ్ వీఆర్వో ఐ.సుజాతతో పాటు రెవెన్యూ అధికారులు సదరు భూములను పరిశీలించారు. మొత్తం 93 ఎకరాల 87 సెంట్లు పోరంబోకు భూమి ఉండగా, 40 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఆర్ఐ మూర్తి తెలిపారు. ఆక్రమణదారులందరికీ త్వరలోనే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తామని తెలిపారు. భూములను పరిశీలించిన వారిలో మండల సర్వేయర్ సీహెచ్ కోటంరాజు, సచివాలయ సర్వేయర్లు కల్యాణ్, పరమేశ్వరరెడ్డి, రామకృష్ణ, పార్వతి ఉన్నారు.

కత్తి మీద సామే!

(5వ పేజీ తరువాయి)

సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పరిస్థితులను ఇప్పటికే గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

చికిత్స పొందుతున్న వీఆర్వోల వివరాలు

- బేస్తవారపేట మండలం అక్కపల్లె గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న షేక్ మీరావలి అధికారుల ఒత్తిళ్లతో ఆందోళనకు గురై అనారోగ్యం బారిన పడి ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

- అర్ధవీడు మండలం దొనకొండ గ్రామ వీఆర్వో ఎం.అంజనేయులు ఇటీవల గిద్దలూరు ఏబీఎం పాలెం సచివాలయానికి బదిలీ అయ్యారు. అయితే దొనకొండలో పనిచేసే సమయంలో ఆరోగ్యం దెబ్బతింది. అప్పటి నుంచే హాస్పటల్‌లో చేరి చికిత్స పొందుతున్నారు.

- అర్ధవీడు మండలం కాకర్ల వీఆర్వోగా పనిచేస్తున్న జంగిటి సుబ్బరాయుడు పని ఒత్తిడి పెరిగి పక్షవాతం రావడంతో సెలవుపై ఉన్నారు.

- కొమరోలు మండలం చింతపాలెం వీఆర్వోగా పనిచేస్తూ ప్రస్తుతం మొహిద్దీన్‌పురం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న దాసరి వీరయ్య పనిభారంతో తట్టుకోలేక హార్ట్ సమస్య రావడంతో ప్రస్తుతం బైపాస్ సర్జరీ చేయించుకొని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

- యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం వీఆర్వోగా పనిచేస్తున్న పిక్కిలి చెన్నయ్యకు ఇటీవల పక్షవాతం వచ్చి వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు.

-ఇలా అనేక ప్రాంతాల్లో వీఆర్వోలు భారం పెరడగటంతోపాటు అధికారుల తీరు, రెండు శాఖల మధ్య సమన్వయం లేని కారణంగా మరింత ఇబ్బందులు పడుతున్నారు.

పనిభారం పెరగడంతో మానసిక ఒత్తిళ్లు



- వైపీ రంగయ్య, వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శిప్రస్తుతం వీఆర్వోలం పని భారంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే మాపై ఒత్తిళ్లను తగ్గించాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించాం. గ్రామాల్లో అనేక పనులు చేయాల్సి రావడం, టార్గెట్లు విధించడంతో ఒత్తిడిని తట్టుకోలేక అనేక మంది వ్యాధుల బారిన పడి వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ఉద్యోగి రోజువారీ పనులతోపాటు అదనపు పనులు చేయాల్సి రావడం కూడా ఆందోళనకరంగా మారింది. వాటన్నింటిని అధిగమించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మంత్రి ఆదేశించినా మారలేదు..!

(5వ పేజీ తరువాయి)

పారిశుధ్యం అధ్వానంగా మారింది. పేరుకు వందల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. చీపురు పట్టరు. చెత్త ఎత్తని పరిస్థితి ఇక్కడ నెలకొంది. మరోవైపు రోగులను అంబులెన్స్ నుంచి ఆసుపత్రిలోకి తీసుకొచ్చేందుకు ఉన్నటువంటి స్ట్రెచ్చర్లలో కొన్నింటిని ఆసుపత్రి సిబ్బంది రికార్డులు తీసుకెళ్లడానికి, మందులు తరలించడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. మరోవైపు ఉన్న మిగతా ఒకటి అరా స్ట్రెచ్చర్లను రోగుల బంధువులే నెట్టుకొంటూ ఆసుపత్రిలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వార్డుల్లో కెళితే కంపు. ఆసుపత్రి ఆవరణంలో కుక్కల బెడద, రోగులకు ఏర్పాటు చేసిన లిఫ్టులు పనిచేయకపోవడంతో జీజీహెచ్ అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

సిబ్బంది మధ్య సమన్వయలోపం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే హెచ్చరిస్తుండగా, సిబ్బందిలో మాత్రం సమన్వయం లోపించింది. ఎవరికి వారే గ్రూపులుగా విడిపోయారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంటోంది. కొందరు సిబ్బంది వైద్యులతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆసరా చేసుకుని కనీసం వార్డులకు కూడా వెళ్లకుండా పెత్తనం చేయడానికి పరిమితం అవుతున్నారు. ఇదిలా ఉంచితే ఓపీ దగ్గర నుంచి రక్త పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, మందులు వంటి ఇతర వైద్యపరీక్షల వరకు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది.

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు

(5వ పేజీ త రువాయి)

ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడతామని తెలిపారు. కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేసేందుకు రూ.392.45 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. చేపల ఉత్పత్తిలో మొత్తం దేశంలోనే 29.1శాతం వాటాతో రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని, అందులో ప్రకాశం జిల్లా ముందంజలో ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు వలసలను నివారించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలు నగరంలో మత్స్యకార భవనానికి గతంలో రూ.25 లక్షలు ఎంపీ గ్రాంటు కింద ఇచ్చామని, నిర్మాణం చేపడితే ఆ నిధులను రెన్యూవల్ చేసి ఇస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విజయవాడలో ఇటీవల వచ్చిన వరదల సమయంలో పిలిచిన వెంటనే 35 బోట్లతో 75మంది మత్స్యకారులు విజయవాడకు వెళ్లి వారం రోజుల పాటు వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. తమిళనాడు నుంచి వస్తున్న సోనా బోట్ల సమస్యను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో ఫిషరీస్, ఆక్వాకల్చర్ రంగాల వృద్ధి ఒకటిగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు. పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఇటీవల వరద సహాయక చర్యల్లో పాల్గొన్న పలువురు మత్స్యకారులను సత్కరించారు.

బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం సర్కిల్ పరిధిలో పలు మద్యం దుకాణాలను సిబ్బందితో కలసి సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపులను ప్రోత్సహించినా, మద్యం అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశారన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న 24 దుకాణాలకు సంబంధించి నిబంధనల మేరకు చేపట్టాల్సిన చర్యలు పూర్తయ్యాయన్నారు. ఇకపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ లేదా స్థానికంగా తాము ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. దుకాణదారులకు పలు హెచ్చరికలు, సూచనలు చేశారు.


నేడు విద్యుత్ కోత

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాల్లో విద్యుత్ కోత విధించినట్లు డీఈఈ సురేంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంత్యక్రియలకు అవస్థలు

- చిట్టడవులను తలపిస్తున్న మరు భూముల స్థలాలు
- శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి







1. వైదనలో చిల్ల చెట్ల మధ్య కనుమరుగైన హిందూ శ్మశానవాటిక
2. దారి మూసుకుపోయి ఉన్న అంబడిపూడి శ్మశానవాటిక
3. ముక్తేశ్వరంలో అభివృద్ధికి నోచుకోని వాటిక

బల్లికురవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతిమ సంస్కారానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలలో మరుభూముల స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామాలలో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలకు బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. కనీసం దారి కూడా లేకపోవడంతో కొందరు యంత్రాలను తీసుకు వచ్చి లోపలికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచారని, ఆ తర్వాత వైసీపీ వచ్చాక శ్మశానవాటికలు అడవుల్లా తయారయ్యాయని ప్రజలు వాపోతున్నారు.

బల్లికురవ మండలంలోని అంబడిపూడి హిందూ శ్మశాన వాటిక పూర్తిగా అడవిలా మారింది. కనీసం దారి కూడా లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మ చెట్లు పెరగడంతో లోపలికి వెళ్లే వీలు లేక ప్రజలు మృతదేహాలను యంత్రాల ద్వారా లోపలికి తీసుకు వెళ్లి దహన సంస్కారాలను పూర్తి చేస్తున్నారు. అలానే ముక్తేశ్వరం గ్రామంలో శ్మశానవాటిక చుట్టూ తుమ్మపొదలు అలుముకున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన రూములు సైతం శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైదన గ్రామంలో శ్మశాన స్థలం కనుమరుగు అయిందని ప్రజలు వాపోతున్నారు. పిచ్చి చెట్లు, చిల్ల చెట్లు పెరిగడంతో అంత్యక్రియలు సాహసంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. గుంటుపల్లి, కొప్పెరపాలెం, చెన్నుపల్లి, కొండాయ పాలెం, కొప్పెరపాడు, కూకట్ల పల్లి, కొత్తూరు, వెలమవారిపాలెం, ఉప్పు మాగులూరు, కొణిదెన తదితర గ్రామాల్లోని శ్మశానవాటికలూ అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2016లో పలు గ్రామాలలో శ్మశానవాటికలను అభివృద్ధి చేశారని, ఆ తర్వాత పట్టించుకునేవారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం శ్మశానవాటికలను తక్షణమే అభివృద్ధి చేసి, వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంబడిపూడిలో చిట్టడవిని తలపిస్తున్న శ్మశానవాటిక



భూ వివాదంపై విచారణ జరుపుతున్న తహసీల్దార్ సింగారావు

భూ వివాదంపై తహసీల్దార్ విచారణ

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కశ్యాపురం గ్రామంలో తలెత్తిన భూ వివాదంపై తహసీల్దార్ పి.సింగారావు గురువారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన రైతు ధూళిపాళ్ల గంగయ్యకు సర్వే నెంబరు 748లో 5 ఎకరాల 93 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి విస్తీర్ణం విషయంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు గంగయ్య దరఖాస్తు ఇచ్చారు. ఈ విషయమై తహసీల్దార్ సింగారావు ఆ భూమిని పరిశీలించారు. విస్తీర్ణ వ్యత్యాస విషయమై రైతులతో విచారించారు. తగు చర్యలు చేపడతామన్నారు. వీరి వెంట వీఆర్వో సుమతి, సర్వేయర్ రాజా పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి సిబ్బందిని ఆదేశించారు. పంగులూరులోని సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎపీఈడీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి. హాజరు నమోదు చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రలోని రికార్డులను పరిశీలించి నిల్వ ఉన్న స్టాక్‌ను తనిఖీ చేశారు. వీరివెంట ఈవో ఆర్డీ కె.సుమంత్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని సంతబజార్‌లో గల శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి 99వ విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని దేవస్థాన కమిటీ ప్రతినిధులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ధ్యాన మండలి వారిచే భజన కార్యక్రమం, తరువాత కుంకుమార్చన, శాంతి హోమం, రాత్రి సమయంలో మహిళ భక్తులతో దీపోత్సవాన్ని వైశంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు గుంటూరు మాధవరావు, రాజా, నారాయణ, శేషారత్నం, పవన్, ధనలక్ష్మి, సీతా మహాలక్ష్మి, ప్రభాకరరావు పర్యవేక్షించారు.

అక్రమ లేఅవుట్లకు చెక్

- ప్రత్యేక కార్యాచరణ
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లేఅవుట్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో అడుగులు వేస్తున్నామని ఆర్డీ వో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో రియల్ వ్యాపారుల న యా దందా శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అనధికారిక లేఅవుట్లతో కొనుగోలుదారులు నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టేందుకు గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రాథమికంగా కనీసం కన్వర్షన్ రుసుము కూడా చెల్లించకుండా అక్రమ లేఅవుట్లు వేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అందులో భాగంగా నిబంధనల మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. తరువాత కూడా నిబంధనలను అనుసరించి మాత్రమే లేఅవుట్లు వేయాలన్న విషయాన్ని పక్కాగా చెప్తామన్నారు.

కొనుగోలుదారులు అన్ని అనుమతులు ఉన్న లేఅవుట్లలో మాత్రమే స్థలాలు కొనుగోలు చేయాలన్నారు. సరైన సమాచారం తెలుసుకోకుండా అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొనుగోలుచేసి ఇబ్బందులకు గురికావద్దని, నష్టపోవద్దని కొనుగోలుదారులకు సూచించారు. అ లానే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

అక్రమాలకు పాల్పడే ఎవరిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. తొలిసారి పట్టుబడిన వారికి అపరాధ రుసుము, హెచ్చరికలతో వదిలేస్తామన్నారు. మరలా పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అనధికార లేఅవుట్లకు అధికారులు, సిబ్బంది ఎవరు సహకరించినా వారికి షోకాజ్ నోటీసులిచ్చి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో స్పష్టం చేశారు.

మండల స్థాయి విజేతలు

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు. ఈ పోటీలలో వ్యాసరచన పోటీలలో డి.సాయిశ్రీ (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల), వక్తృత్వంలో ఏ.అమృత (జడ్పీహెచ్ఎస్ చక్రాయపాలెం), క్విజ్ పోటీలలో ఎం.సాయి సమీరా, (ప్ర భుత్వ బాలికల ఉన్నత పాఠశాల), డిబెట్‌లో ఎం.సాయి సమీరా, పి.లక్ష్మి దేవి, దేశభక్తి గీతాలు డి. మహశ్రీ (గురుకుల పాఠశాల, అద్దంకి) విజేతలుగా నిలిచారని తెలిపారు.

పోలేరమ్మ దేవాలయంలో అన్నదానం

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం అద్దంకి పట్టణంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సుమారు 2500 మందికి అన్నదానం చేశారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

పింఛన్‌కు దరఖాస్తులు స్వీకరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా పింఛన్‌ల కోసం దరఖాస్తులను స్వీకరించాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. గురువారం మండలంలోని శింగరకొండపాలెం సచివాలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పరిస్థితిని రికార్డుల ద్వారా పరిశీలించారు. ఎస్సీ కుటుంబాల రీ సర్వే వెరిఫికేషన్‌ను గురించి ఆరా తీశారు. నూతనంగా పింఛన్‌ల కోసం, గృహాల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బంది సూచించారు.

చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణ మహోత్సవం

చినగంజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు నారాయణం సత్యబాబు, సారంగపాణి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు దీవి హనుమత్ ప్రసాద్ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులరా తిలకించారు.

ఈ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. కార్యనిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పర్చూరులో చెలరేగిన దొంగలు

- నాలుగు దుకాణాల్లో దొంగతనం
- సీసీ కెమెరాలో డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీ
- క్లూస్ టీం ఆధారాల సేకరణ

పర్చూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో దొంగలు చెలరేగిపోయారు. వరుసగా నాలుగు దుకాణాల్లో షట్టర్లను తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. పర్చూరు - చీరాల రోడ్డులోని ఆటోమొబైల్ షాపుతోపాటు, సమీపంలో ఉన్న చిల్లర దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగలు, ఇంకొల్లు రోడ్డులోని డ్రైఫ్రూట్స్ దుకాణంతోపాటు, సమీపంలోని ఆర్ ఆర్ సెల్ షోరూంలోకి కూడా చొరబడ్డారు. ఆయా దుకాణాల్లో దొరికిన కాడికి నగదుతో పరారయ్యారు. ఆటో మొ బైల్ దుకాణంలో కంపెనీ వారికి చెల్లించేందుకు షాపులో భద్రపరిచిన రూ.85వేల నగదుతోపాటు, సీసీ కెమెరాకు సంబంధించిన రూ.10 వేల విలువ చేసే డీవీఆర్ అపహరణకు గురైందని బాధితుడు వాపోయారు. డ్రైఫ్రూ ట్స్ షాపులో రూ.20వేలకు పైగా నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. సెల్‌షాప్‌లో సీసీ కెమెరా డీవీఆర్, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. మరో చిల్లర దుకాణంలో రూ.2వేల నగదు మాత్రమే అపహరణకు గురైంది. ఉదయాన్నే షాపును తెరిచేందుకు వచ్చిన యజమా నులు చోరీ జరిగినట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో ఆ దుకాణాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.

ఆధారాలు లేకుండా జాగ్రత్త

దుకాణాల్లోకి ప్రవేశించిన దొంగలు తమకు సంబంధించిన ఆనవాళ్లు, ఆధారాలు లేకుండా అక్కడున్న సీసీ కెమెరాల్లోని డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీలకు పాల్పడడంపై అందరూ భయాందోళనకు గురయ్యారు.

నైట్ బీట్‌పై విమర్శలు

సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే. రాత్రి 12.45 గంటలకే చోరీ జరిగినట్లు నమోదు అయింది. ప్రధాన రహదారిలో ఒకేరోజు రాత్రి నాలుగు దుకాణాలలో చోరీ జరగడంతో అసలు నైట్ బీట్ పోలీసుల పర్యవేక్షణపై సర్వత్రా విమర్శలు కురిపిస్తున్నాయి.



డ్రైఫ్రూట్స్ దుకాణంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

ఒకే రోజు నాలుగు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడడంతో ఇటు ప్రజలతో పాటు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. మరో పక్క సమీపంలోని అద్దంకి పట్టణంలో గత రాత్రి దొంగలు బీభత్సం చేసి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడం ప్రజలకు కలవరానికి గురిచేస్తోంది. సిబ్బంది కొరత ఒకింత పోలీసులకు తలనొప్పిగా మారింది.

భూమిని పరిశీలించిన ఆర్డీవో

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేణంగివరంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం భూమిని పరిశీలన చేశారు. గ్రామానికి చెందిన బి.పద్మజ సర్వే నెంబరు 103 - 6ఏ లో తనకు న్న ఎకరం ముప్పై రెండున్నర సెంట్ల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ఆర్డీవోకు దరఖాస్తు చేశారు. ఆమె విజ్ఞప్తి మే రకు ఆ భూమిని ఆర్డీవో తహసీల్దార్ పీ సింగారావుతో కలసి పరిశీలించి, రికార్డులను చూశారు.

అక్రమంగా తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేటపాలెం(చీరాల), నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఆదేశాల మేరకు గురువారం 5 ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ పార్వతి పట్టుకున్నారు. 216 జాతీయ రహదారిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పార్వతిని ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఆ ట్రాక్టర్ల యజమానులకు అపరాధ రుసుము విధించారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు దోహదపడే హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌టీఐ రిసోర్స్ పర్సన్ దాసరి ఇమ్మానియేల్ అన్నారు. పట్టణంలోని పచ్చతోరణం కల్యాణ మండపంలో మూడు రోజుల హక్కులపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసమావేశంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు.

ఓ విద్యార్థీ మేలుకో!

నిత్యం శాంతిభద్రతల పరిరక్షణలో తీరిక లేకుండా ఉండే పోలీసులు విద్యాలయాల్లో గురువులుగా మారారు. విద్యాబుద్ధులతోపాటుగా సమాజ శ్రేయస్సుకు దోహదపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు నడుం బిగించారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్‌నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటింపు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ లాంటి అంశాలపై మేల్కొలిపేందుకు ఎస్పీ ఏఆర్.దామోదర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 18 నుంచి జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో కానిస్టేబుల్ నుంచి అధికారి వరకు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంగారు బాల్యం నినాదంతో విద్యా సంస్థల్లో అవగాహన కల్పిస్తారు. ఇవి నెలపాటు సాగుతాయి. కొత్తపట్నం (కేజీబీవీ), ఒంగోలు (సరస్వతీ కాలేజీ), రాచర్ల (విద్యాన్ స్కూల్), కొమరోలు మండలం రాజుపాలెం (జడ్పీ హైస్కూల్), దర్శి (పీఎస్ఆర్ కాలేజీ), మద్దిపాడు మండలం లింగంగుంట (జడ్పీ హైస్కూల్), పొన్నలూరు మండలం మాలపాడు (కేజీబీవీ)లో ఇప్పటికే అవగాహన కల్పించారు. ఈ మూడు రోజుల్లో సుమారుగా వంద విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

- ఒంగోలు (క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)

సైబర్ నేరాలపై అప్రమత్తం



పిల్లలు ఫోన్లలో సామాజిక మాధ్యమాలు వినియోగిస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సైబర్ నేరగాళ్లు ఫేక్ ఎస్ఎంఎస్‌లు పంపడం, బ్యాంక్ అధికారులమని ఫోను చేసి మీ వ్యక్తిగత సమాచారం తీసుకొని ఖాతాల్లో నగదు దోచుకోవడం పరిపాటిగా మారింది. బ్యాంక్ అధికారులు ఎవరూ ఫోన్లు చేసి ఆధార్, పాన్ నంబర్లు అడగరు. డిజిటల్ అరెస్టు అనేది అసలు ఉండదు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. ఇలాంటి అంశాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు



డయల్ 100, 112లను సంప్రదించాలి

అత్యవసర సమయాల్లో 100, 112కు కాల్ చేస్తే పోలీసు సహకారం వెంటనే అందుతుంది. పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు. ఈవిటీజింగ్, అకతాయిల వేధింపులున్నా ఈ నంబర్లకు ఫోన్ చేసి చెబితే వెంటనే పోలీసులు ప్రత్యక్షం అవుతారని అవగాహన కల్పిస్తున్నారు.

అతివేగంతో రోడ్డు ప్రమాదాలు

రహదారి నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, హెల్మెట్ లేకుండా వెళ్లడం, మద్యం సేవించి నడపడం, వేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణించడం, వాటివల్ల ప్రమాదాలన బారిన పడటం లాంటి ఘటనల్లో జీవితాలను కోల్పోయి కుటుంబాలే ఛిన్నాభిన్నం అయిన ఘటనలను వివరిస్తున్నారు. ఇదే విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పాలని పోలీసులు సూచిస్తున్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయే తాజా ఘటనలను చూపి చైతన్యపరుస్తున్నారు.



సామాజిక అంశాలపై పోలీసుల ప్రత్యేక పాఠాలు

- విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం
- డ్రగ్స్, ర్యాగింగ్ నివారణ, సైబర్ నేరాల నియంత్రణ...
- బాలికల పట్ల ప్రవర్తన తదితర అంశాలపై బోధన
- నెల రోజుల నిర్వహణకు నడుంబిగించిన ఎస్పీ


అవగాహనతో నేరాలు తగ్గుముఖం



చిన్నతనం నుంచే సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే నేరాలు చాలా వరకు తగ్గుముఖం పడతాయి. అందుకే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నెల రోజులుపాటు ప్రత్యేక కార్యక్రమంగా తీసుకున్నాం. పోలీసులు పాఠశాలలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఇవి మొదలయ్యాయి. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈ అవగాహన తరగతులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులను చైతన్యవంతుల్ని చేయడంతోపాటు వారి తల్లిదండ్రులను మేల్కొలపడానికి తోడ్పడుతుంది.

- ఏఆర్ దామోదర్, ఎస్పీ

ఈవ్ టీజింగ్ నిర్మూలన



విద్యాలయం అవరణ లోపల, వెలుపల ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పాఠశాలలకు వచ్చి వెళ్లే దారిలో ఆకతాయిల వేధింపులుంటే ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. తల్లిదండ్రులకు చెప్పాలి. పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులుగానీ, తోటి విద్యార్థులుగానీ తాకరానిచోట తాకితే తల్లిదండ్రులకు తెలియాజేయాలి. అనుమానాస్పదంగా కొంతమంది ఆకతాయిలు ఇంటి చుట్టూ తిరగడం, పాఠశాలలకు వెళ్లే సమయంలో వెంటబడటం లాంటి చేష్టలకు పాల్పడితే తల్లిదండ్రుల ద్వారా సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

మాదకద్రవ్యాలతో బతుకు ఛిద్రం

గంజాయి, డ్రగ్స్ రవాణా చేయడం నేరం. మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. మత్తుకు బానిసలుగా మారి నేరాలవైపు వెళతారు. దీనివల్ల శారీరక, మనసిక సమస్యలు వస్తాయి. అలా రవాణా చేస్తూ పట్టుబడినవారు జైలుపాలై బతుకును నాశనం చేసుకుంటున్న ఉదాహరణలను విద్యార్థులకు పోలీసులు వివరిస్తున్నారు. ఒకసారి పోలీసు రికార్డుల్లోకి ఎక్కితే భవిషత్‌లో ఉద్యోగాలు రావు. యువత ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొంది బంగారు భవిషత్తుకు బాటలు వేసుకోవాలని సూచిస్తున్నారు.





రైతులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగుల మధ్య జరుగుతున్న వాగ్వివాదం

అక్రమంగా గ్రావెల్ తరలింపు

- అడ్డుకున్న పేరాయపాలెం రైతులు

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులూ లేకుండా గ్రావెల్ తరలిస్తుండడాన్ని తాళ్లూరు మండలం రైతులు గురువారం అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా తరలింపు నిలిచిపోయింది. అద్దంకి మండలంలోని మోదేపల్లి రెవెన్యూ పరిధిలో 312 సర్వే నెంబర్‌లో కొండ ఉంది. ఆ కొండ సమీపంలో ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం పేరాయపాలేనికి చెందిన రైతులకు భూములు ఉన్నాయి. బెంగళూరు హైవే నిర్మాణంలో భాగంగా కొండ నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పేరాయపాలెం రైతులు గురువారం గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. రైతులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగుల మధ్య వాగ్వివాదం జరిగింది. మోదేపల్లి రెవెన్యూ పరిధిలోని 312 సర్వే నెంబర్‌లో సుమారు 80 ఎకరాల కొండ ఉంది. బెంగళూరు హైవే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ గ్రావెల్ కోసం 4 హెక్టార్లలో లీజు కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. అయినా కొండ నుంచి గ్రావెల్ తరలించారు. సొంత అవసరాలకు, స్థానిక అవసరాలకు గ్రావెల్ తరలిస్తే నానా హడావుడి చేసే మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు భారీ యంత్రాలతో కొండను గుల్ల చేస్తుంటే పట్టించుకోలేదు. కొండ నుంచి గ్రావెల్ తరలిస్తే పశువులు, గొర్రెల మేతకు ఇబ్బందులు ఏర్పడుతాయని కొర్రపాటివారిపాలేనికి చెందిన రైతులు, గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రావెల్ తరలింపును రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, ఉప సర్పంచ్ జెట్టి పోతురాజు ఆధ్వర్యంలో రైతులు, గొర్రెల కాపరులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రావెల్ తరలింపును తాత్కాలికంగా విరమించి వెళ్లిపోయారు. కొండ నుంచి గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అనుమతులూ లేవని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ స్పష్టం చేశారు.




ఒంగోలు-కొప్పోలు రోడ్డుకు ప్యాచ్ వర్కులు

ఎట్టకేలకు మరమ్మతులు

- కొప్పోలురోడ్డులో పనులు చేపట్టిన అధికారులు

ఒంగోలు(రూరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలురోడ్డు అధ్వానంగా మారి వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పందించి ఆదేశాలు ఇవ్వడంఓ కార్పొరేషన్ అధికారులు మరమ్మతు పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక 10వ డివిజన్ ఏఈ బి.లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ ఇటీవల కొప్పోలు రోడ్డులో శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో అంబేద్కర్‌కాలనీకి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారని తెలిపారు. ఈ రోడ్డులో గుంతలు ప్రమాదకరంగా మారడంతో ఈ ఘోరం జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దామచర్ల వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలు లేకుండా చేయాలని ఆదేశించారని చెప్పారు. అయితే ఈ రోడ్డుకు డ్రైనేజీ లేకపోవడంతో గుంతల పడిన చోట కొంత మట్టి తవ్వుతుంటే నీరు ఉబికి వస్తుందని తెలిపారు. డ్రైనేజీ ఏర్పాటు చేస్తేనే తారురోడ్డు ఎక్కువకాలం మన్నికగా ఉంటుంద న్నారు. కాగా ఆర్అండ్‌బీ శాఖ చేయాల్సిన పనులు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేస్తున్నారు. నగర ఎంఈ ఎన్.చంద్రయ్య, డీఈ టి.పద్మజ పనులను పరిశీలించారు.

డీసీటీవో శ్రీనివాస్‌ప్రసాద్‌కు రిమాండ్

ఒంగోలు(క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం-2లో డీసీటీవో-1గా పనిచేస్తున్న కేవీ.శ్రీనివాస ప్రసాద్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయములో రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు శ్రీనివాస్‌ప్రసాద్ పట్టుబడ్డారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు అరెస్టు చేసి గురువారం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు.

వృత్తి పన్ను చెల్లింపుల విషయంలో లంచం డిమాండ్

టంగుటూరు వెంకటేశ్వర ఆక్వా ట్రేడర్స్‌కు సంబంధించి మూడు బ్రాంచీలు ఉన్నాయి. ఒకదానికి కేవలం రూ.6,5000 వృతి పన్ను చెల్లించాలి. అందుకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. అయితే డీసీటీవో స్వయంగా ఆక్వా ట్రేడర్స్ బ్రాంచీలను సందర్శించి వృత్తి పన్ను రూ.6.50 లక్షలు జరిమానా చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. మరో రెండు బ్రాంచీలు తనిఖీలు చేసి జరిమానా విధిస్తానని తెలిపారు. వెంకటేశ్వర ఆక్వా ట్రేడర్స్ అకౌంటెంట్ వాణిజ్యపన్నుల కార్యాలయానికి వెళ్లి డీసీటీవోతో మాట్లాడారు. జరిమానాలు లేకుండా చేసేందుకు తనకు రూ.2లక్షలు ఇవ్వాలని కోరారు. ఆక్వా ట్రేడర్స్ యజమాని శ్రీధర్‌తో మాట్లాడి చెబుతానని అకౌంటెంట్ తెలిపారు. అసలు ఎలాంటి పన్నులు లేని దానికి రూ.2లక్షలు డిమాండ్ చేయడంపై యజమాని విస్తుపోయాడు. డీసీటీవో రూ.1.50 లక్షలు ఇస్తామని తెలిపి ఏసీబీ అధికారులను శ్రీధర్ ఆశ్రయించారు. బుధవారం ఈమేరకు వాణిజ్యపన్నుల కార్యాలయములో టీసీటీవోకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పశువుల్లో బ్రూసెల్లా వ్యాధి నివారణకు టీకాలు

- కలెక్టర్ అన్సారియా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆడ పశువులల్లో గర్భస్రావానికి, మగ పశువుల్లో కీళ్ల వాపుల వంధత్వానికి కారణమయ్యే బ్రూసెల్లా వ్యాధి నియంత్రణకు జిల్లాలో ఈనెల 20 నుంచి వచ్చేనెల 19వ తేదీ వరకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం కలెక్టర్ అన్సారియా బ్రూసెల్లా వ్యాధి టీకాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ వ్యాధి పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఉందని, అందువల్ల జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల పెయ్య దూడకులకు ఈ టీకాలు వేస్తారని తెలిపారు. ఒక్కసారి ఈ టీకా వేస్తే మరెప్పుడు ఈ వ్యాధికి వాటికి రాదని పేర్కొన్నారు.

24న జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(రూరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డాక్టర్ ఆనంద్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 1గంటకు జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే పురుషులు 85 కిలోలలోపు, మహిళా క్రీడాకారులు 75కిలోలలోపు బరువు ఉండాలన్నారు.

మూడు నెలలకు ఒకేసారి ఫింఛన్

- ఈనెల నుంచే అమల్లోకి
- జిల్లాలో 1,283 మందికి లబ్ధిదారులకు లబ్ధి



ఒంగోలు నగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు భారీ ఊరట కల్పించింది. రెండు నెలలపాటు పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో మూడు నెలలకు కలిసి ఒకేసారి మొత్తం సొమ్మును తీసుకునే వెసులుబాటు ఇచ్చింది. ఈ విధానం ఈనెల నుంచే అమల్లోకి తెస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గురువారం అన్ని జిల్లా కేంద్రాలకు ఉత్తర్వులను పంపించింది. వైసీపీ ప్రభుత్వం సామాజిక పింఛన్లపై గొప్పలు చెప్పుకుందే గానీ లబ్ధిదారులు ఏ నెలలో పింఛన్ తీసుకోకపోతే అంతే సంగతులు. మరుసటి నెలలో ముందు నెల పింఛన్ ఇచ్చేవారుకాదు. దీంతో ప్రతినెలా అనేక మంది లబ్ధిదారులు పింఛన్‌ను కోల్పోయేవారు. మరుసటి నెలలో అడిగినా పట్టించుకునేవారు కాదు. పనిమీద వేరే ఊరు వెళ్లినా, వారికి ఆరోగ్యం బాగులేక ఆసుపత్రిలో ఉన్నా ఆనెలలో పింఛన్ తీసుకోకపోతే వదులుకోవాల్సిన దుస్థితి ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం ఆ ఇబ్బందులను తొలగిస్తూ నిర్ణయించింది. రెండు నెలల పాటు పింఛన్ తీసుకోకపోయినా మడో నెలలో ఒకేసారి పింఛన్ ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానం నవంబరు మాసం నుంచే అమలు చేయబోతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నెలలో పింఛన్ తీసుకోకపోతే వచ్చే డిసెంబర్‌లో పంపిణీ చేసే పింఛన్‌తో పాటే నవంబర్ పింఛన్ కూడా అందజేస్తారు. డిసెంబర్‌లో కూడా తీసుకోకపోతే వచ్చే ఏడాది జనవరిలో పంపిణీ చేసే పింఛన్‌తో పాటు మూడు నెలలకు ఒకేసారి అందజేస్తారు. ఇలా పింఛన్ పొందే లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించింది.

ఈనెలలో పింఛన్ తీసుకోనివారు 2,249 మంది

జిల్లాలో ఈనెల ఒకటి రెండు తేదీల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసింది. జిల్లా మొత్తం ఎన్టీఆర్ భరోసా కింద 2,87,127 పింఛన్లు ఉండగా వీరిలో 2,249 మంది నవంబర్ మాసంలో పింఛన్లు తీసుకోలేదు. ఇందులో 966 మంది చనిపోగా 1,283 మంది వివిధ కారణాలతో పింఛన్ తీసుకోలేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరు వచ్చే నెలలో రెండు నెలలవీ కలిపి పింఛన్ తీసుకోవచ్చు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు పాకల విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సింగరాయకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీల్లో అండర్-19 బాలికల విభాగంలో వివిధ కేటగిరీలలో కె.లేఖనందన, సీహెచ్ సుస్మిత, వి.హిమశ్రీ, వి.కీర్తి, కె.దీపిక, వి.శ్రావణి, కె.మేరీ, వి.అంకమ్మ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలుర విభాగంలో సీహెచ్ ఈశ్వర్‌కుమార్, థామస్, ఉదయ్‌కుమార్, యాదగిరి, దీలిప్, ప్రశాంత్, ఎనోష్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 23, 24తేదీల్లో తిరుపతి జిల్లా రేణిగుంటలో జరిగే జూడో పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్యలు అభినందించారు.

అండర్‌పాస్ బ్రిడ్జి మంజూరుపై హర్షం



ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ఎన్.అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిని మంజూరు చేయించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గురువారం ఘనంగా సత్కరించారు స్థానిక మాగుంట కార్యాలయంలో 16వ డివిజన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఎన్నో ఏళ్ళుగా కలగా ఉన్న అండర్‌పాసు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమర నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు ఉంగరాల రవణయ్య, నాయకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మాదాశి చంద్ర, ఆల్లూరి హరి, కూనంశెట్టి చక్రవర్తి, దావూరి శ్రీనివాసరావు, శశి, ఏకాంబరం, సాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

43 మంది క్విస్ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఫారసీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఏజీఎస్ హెల్త్ కంపెనీ ప్రతినిధులు గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి 43మందిని ఎంపిక చేశారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను కళాశాల వ్యవస్థాపక చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రి, డీన్ చల్లా రామ్‌స్వామి, ప్రిన్సిపాల్ ఎం.కిషోర్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం



ఆక్వా రంగ ప్రతినిధులను సత్కరిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఆక్వా కల్చరల్‌డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌వోడీ బి.హరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి మాట్లాడుతూ అనతికాలంలోనే ఆక్వాకల్చర్ రంగం బాగా విస్తరించిందన్నారు. ఆక్వాసాగులో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో కోస్తాతీరం 972 కిలోమీటర్లు విస్తరించి ఉన్నందున వ్యవసాయరంగంతో పాటు చేపలు, రొయ్యల పెంపకం వంటి వాటికి కోస్తాంధ్ర ప్రజలు అధికప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, దేవీ సీ ఫుడ్స్ డివిజన్ మేనేజర్ అన్సారి, మేనేజర్ ఎం.నాగరాజు, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, అధ్యాపకులు సురేష్, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు. అనంతరం పలువురిని సత్కరించారు.

విద్యార్థులకు అభినందన

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారుబాల్యం కార్యక్రమంలో భాగంగా ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీల్లో కొండపి విద్యార్థులు ప్రతిభ కనబరచగా కొండపిలోని ఎంఈవో కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అధికారులు అభినందించారు. డ్రాయింగ్‌లో జీహెచ్‌ఎస్ విద్యార్థి జె.సిరివల్లి, గురుకుల విద్యార్థి డి.నిశిష చిత్రలేఖనంలో ద్వితీయస్థానాల్లో నిలిచారు. వీరిని తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు అభినందించారు. ఎంఈవో కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన నాగేశ్వరరావు దంపతులను అధికారులు సన్మానించారు.

24న మల్లవరంలో రెడ్డి సంఘం కార్తీక వనమహోత్సవం



మాట్లాడుతున్న చంద్రారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెడ్డి జనాభ్యుద సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వతేదీన మద్దిపాడు మండలం మల్లవరంలో కార్తీక వనభోజనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమ నిర్వహక సభ్యుడు గుడిపాటి చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక రెడ్డిహాస్టల్‌లో గురువారం రాత్రి జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నగరంలోని రెడ్డి కులస్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. లింగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్తీక వనమహోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, పాలవెల్లి నరసింహారెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

చీమకుర్తి గోల్డ్‌షాపులో ఉంగరాలు మాయం

● కస్టమర్‌గా వచ్చి చోరీకి పాల్పడిన వైనం

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) బంగారం దుకాణంలోకి వచ్చి ఓనర్, షాపు సిబ్బందిని ఏమార్చిన ఆగంతుకుడు ఉంగరాలను చోరీ చేసిన సంఘటన గురువారం చీమకుర్తిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చీమకుర్తి పాతబస్టాండ్ సమీపంలో ఉన్న చలువాది సత్యనారాయణ గోల్డ్‌షాపులో ఈ సంఘటన మంగళవారం సాయంత్రం జరగ్గా షాపు ఓనర్ సీసీ ఫుటేజీ గురువారం పరిశీలించిన తదుపరి తన షాపులో ఉంగరాల సంచి మాయమైందని గ్రహించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓనర్ చలువాది సుష్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆగంతుకుని ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు

మర్రిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మర్రిపూడిలోని చర్చి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. పాదచారులు సైతం ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాలనీవాసులు ఆ దారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగిస్తున్నారు. మట్టిరోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచ్ చెప్పారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మద్దిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడు గ్రామపంచాయతీలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని గురువారం జేఈ డి.ప్రసాద్ పరిశీలించారు. ఏఈ రవిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే గ్రామంలో రూ.80లక్షల ఉపాధి నిధులతో అంతర్గత సీసీ రోడ్డు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని జేఈ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు వడ్డంపూడి శ్రీనివాసరావు, కుంచాల రామాంజీ, మల్లిపెద్ది రాజా, కాట్రగడ్డ వెంకటసుబ్బారావు, పరుచూరి శేఖర్, చెన్నుపాటి కోటి, కుంచాల శ్రీను, మోరబోయిన సురేష్ పాల్గొన్నారు.

గాంధీపార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు



పార్కులో ప్రహరీ లేని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని గాంధీపార్కును అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీకి చెందిన నగర బృందం గాంధీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆట వస్తువులు ఉన్న స్థలంలో గత నాలుగేళ్ళుగా ఇసుక వేయనందున పిల్లలు పడి దెబ్బలు తగులుతున్నాయన్నారు. తక్షణమే ఇసుక వేయడంతో పాటు ఊయలలు కొత్తవి ఏర్పాటు చేయాలని, జారుడుబండలకు మధ్యలో రంధ్రాలు పడ్డాయని, వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఆదివారం ఎక్కువ సంఖ్యలో పిల్లలు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వస్తున్నారని, అందువల్ల అన్ని పార్కుల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్కు ఉత్తరం వైపున ప్రహరీ కూలిపోయిందని, దానిని వెంటనే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.రమేష్, తంబి శ్రీనివాసులు, టి.మహేష్, ఎస్‌డీ.హుస్సేన్, దామా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రూసెల్లా వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

● పశుసంవర్థకశాఖ అధికారి బేబీరాణి



దూడలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు, పరిశీలిస్తున్న జేడీఏ బేబీరాణి

ఒంగోలు(రూరల్)నవంబరు21(ఆంధ్రజ్యోతి): పశువుల్లో బ్రూసెల్లా వ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి తెలిపారు. గురువారం ఒంగోలు నగరం త్రోవగుంట పశువైద్యశాల వద్ద 4-8 నెలలు వయస్సు గల దూడలకు బ్రూసెల్లా వ్యాధి రాకుండా టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల దూడల్లో ఈ వ్యాధి వస్తుందని చెప్పారు. పడ్డలను ఈ వ్యాధి సోకిన దున్నలు దాటటం వల్ల కూడా సంక్రమిస్తుందని తెలిపారు. గర్భం ధరించిన పశువులు ఈసుకపోవటం, కొన్నిసార్లు పశువు మృతి చెందుతుందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు తమ దూడలకు తప్పకుండా బ్రూసెల్లా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బసవశంకరరావు, పశువైద్యశాఖ అధికారి లక్ష్మయ్య, ఆర్.ప్రగతి, మాధవాచారి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలి

● ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థినులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని ప్రకాశంపంతులు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆరోపించారు. కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘటన మరవకముందే లావిద్యార్థినిపై ఇటువంటి దాడి జరగడం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి లైంగిక దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి వీరస్వామి, మాలతి, నాగూర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద్దగోవిందమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

● సీఐ సోమశేఖర్



ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సోమశేఖర్ సూచించారు. గురువారం సాయంత్రం కొండపిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడినా, ప్రాణాపాయం ఉండదన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులతో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమాన్ని సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో కొండపిలోని హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం నిర్వహించారు.

ఓవర్‌లోడ్ చట్ట విరుద్ధం

టంగుటూరు: ఓవర్‌లోడ్ చట్ట విరుద్ధమని, నిబంధనలు అతిక్రమిస్తే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలుంటాయని ఎస్సై నాగమల్లీశ్వరరావు హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు ఎస్సై గురువారం టంగుటూరులో కౌన్సెలింగ్ ఇచ్చారు. విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ కాగితాలు ఉండాలని కూడా సూచించారు.

ఫేక్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలి

ఫేక్ ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్సై నాగమల్లీశ్వరరావు విద్యార్థులకు సూచించారు. సైబర్ క్రైమ్స్, మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న నేరాలు, మాదక ద్రవ్యాల వాడకం తదితర విషయాలపై టంగుటూరు గురుకుల పాఠశాల్లో ఎస్సై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.



ఎండ్లూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

సైబర్‌నేరాలపై అవగాహన

సంతనూతలపాడు: సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాలపై సంతనూతలపాడు, ఎండ్లూరు తదితర గ్రామాల్లో పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నల్లూరి ఫౌండేషన్ చేయూత ఆదర్శనీయం

● ఎంఈవో శివాజీ



కంప్యూటర్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి నల్లూరి ఫౌండేషన్ అందిస్తున్న చేయూత ఆదర్శనీయమని ఎంఈవో శివాజీ తెలిపారు. మండలంలోని ఏలూరివారిపాలెం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఎన్‌ఆర్‌ఐ నల్లూరి వెంకటశేషయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నల్లూరి ఫౌండేషన్ తరఫున కంప్యూటర్‌ని బహూకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో శివాజీ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాంకేతికవిద్యను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు బహూకరిస్తున్న ఎన్‌ఆర్‌ఐ నల్లూరి వెంకట శేషయ్యకు విద్యాశాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాలడుగు వెంకటనారాయణ, గోరంట్ల ప్రసాద్,పుట్టా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గోగినేని రాజా, మన్నం సుబ్బారావు, మన్నం వెంకటేశ్వర్లు, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం వైన్స్‌షాపు ఓనర్లతో సీఐ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము నిర్వహించే స్పెషల్‌డ్రైవ్‌లో మద్యం బాటిళ్ల బెల్టుషాపుల్లో పట్టుబడితే సంబంధిత బాటిళ్లు ఏ షాపునుంచి వస్తే ఆ షాపు ఓనర్‌పై చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టుషాపులను నిర్వహించకుండా పోలీసులు అనుక్షణం నిఘా ఉంచినట్లు చెప్పారు. దాడుల్లో పట్టుబడితే కేసులు నమోదుతో లైసెన్స్ రద్దు అవుతుందని తెలిపారు. ఓనర్లు సహకరించాలని కోరారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీయాలి

● డీఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వివిధ రకాల పోటీలు దోహదపడుతాయని డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో గురువారం నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన స్కూలు స్థాయి విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం పెద్దిరెడ్డి, వేదవతి, మన్నెం శ్రీను, టాప్‌స్కిల్ హెడ్ సాదిక్, జీవన్, కో ఆర్డినేటర్లు శ్రీహరి సుబ్బారావు, స్వాతి తదితరులు ఉన్నారు. అనంతరం విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్స్ కిరణ్‌కుమార్, వలీ సుందర్, నీరుప్‌లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

1న టి.కృష్ణ వర్ధంతి

ఒంగోలు(కల్చరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ వర్ధంతి కార్యక్రమం డిసెంబరు 1వ తేదీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరులో జరగాల్సిన ఈ కార్యక్రమం భారీ వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈక్రమంలో 1వ తేదీన ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పాటల పోటీ అనంతరం సభా కార్యక్రమం ఉంటుందన్నారు. పాటల పోటీకి గతంలో పేర్ల నమోదు చేసుకున్నవారు హాజరుకావాలని, వివరాలకు 9490952736 సెల్‌నెంబరులో సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణం నాణ్యతగా ఉండేలా చూడాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంతనూతలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎనికపాడు గ్రామంలో రోడ్డు నిర్మాణంలో పాతమట్టిని తొలగించకుండా కొత్తగా రోడ్డు అలాగే వేస్తున్నారని, దీనివల్ల రోడ్డు పటిష్టత, నాణ్యత కోల్పోయే ప్రమాదం ముందని టీడీపీ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని, రోడ్డు సైతం గుడికి పైఎత్తులో వేస్తున్నారని, దీనివలన వర్షపు నీరు గుడిలోకి వచ్చే అవకాశముందని తెలిపారు. అదేవిధంగా రోడ్డు వెడల్పు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రామక్రిష్ణ, ఎన్.వెంకట్రావు, ఎం.రమేష్, జి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని దర్శి శాసనసభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను బూచేపల్లి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు అంశాలను జగన్‌తో చర్చించినట్లు తెలుస్తోంది.

మైనంపాడు విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు ప్రభుత్వం ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నరసింహారావు గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా తరుపున బాలురు, బాలికల జట్ల తరపున ప్రతినిధ్యం వహించగా మైనంపాడుకు చెందిన టి.శృతి, కె.చరణ్‌లు రాష్ట్రజట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. వారు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ టి.రవికుమార్ తెలిపారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్ బ్రహ్మయ్య, పీడీ వనజ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధార్ క్యాంపు పరిశీలన

సంతనూతలపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంగమూరు గ్రామ సచివాలయంలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్‌క్యాంపును గురువారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. పెండింగ్ లేకుండా పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణమ్మ పాల్గొన్నారు.

మద్దిపాడు కళాశాలలో గడ్డి తొలగింపు



ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేపడుతున్న సర్పంచ్

మద్దిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, గడ్డి మోకాలు ఎత్తున పెరిగి విద్యార్థులు ఇబ్బందులు పడతుఉన్నారు. ఈ సమస్యను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధికారులకు వివరించారు. దీంతో సర్పంచ్ మద్దిరా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు నవులూరి శివకృష్ణ, నూనె శ్రీను, కార్యదర్శి నూరుల్లాతో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో గడ్డి, పిచ్చ మొక్కలను తొలగించారు.

నాడు నిర్మించిన సీసీరోడ్లకు బిల్లులేవి ?

● ఆరేళ్లపాటు ఎదురు చూసిన కాంట్రాక్టర్లు
● ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఆశలు

పొదిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వ చివరి రోజుల్లో పట్టణంలో పలు సిమెంట్ రోడ్లను టీడీపీ నాయకులు చేపట్టారు. నిర్మాణాలు పూర్తి చేసిన సిమెంట్ రోడ్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో అప్పట్లో రోడ్లు నిర్మించిన టీడీపీ నాయకులు లబోదిబో మంటున్నారు.

ఆగిన బిల్లులకు వడ్డీలు కట్టలేకపోతున్నా మంటున్నారు. 2018 సంవత్సరంలో పంచాయతీ 14వ ఆర్థిక సంఘం సాధారణ నిధులతో పట్టణంలో సుమారుగా రెండుకోట్ల రూపాయలతో రోడ్లు చేపట్టారు. ఎన్నికల సమయం వస్తుందనే సంకేతాలతో అధికారులు పనులను ఆఘమేగాలపైన పూర్తి చేయించారు. కానీ బిల్లులు చెల్లింపు ప్రక్రియ చేపట్టలేదు. కాంట్రాక్టర్లు కూడా బిల్లు వస్తాయనే ఆశతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. ఆతరువాత ఎన్నికల రానేవచ్చాయి. ఎన్నికలు ముగియడం వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ వారు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఆపివేశారు. ఆవిధంగా పట్టణంలో సుమారుగా రెండు కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పట్టణంలో బ్యాంక్‌కాలనీ, గీతాంజలిరోడ్, కళాశాల రోడ్డు, ఇస్లాంపేట, సబ్‌స్టేషన్‌రోడ్, టైలర్స్‌కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర కాలనీల్లో టీడీపీ నాయకులు వేసిన రోడ్లకు అధికారులు బిల్లులు నిలిపివేశారు. వైసీపీ నాయకులు వేసిన రోడ్లకు బిల్లులకు నెలలోనే చెల్లించారు కానీ అంతకు ముందు టీడీపీ నాయకులు వేసిన రోడ్లకు బిల్లులు ఆపడంపై కొందరు కోర్టు మెట్లు సైతం ఎక్కారు. దీంతో కొద్ది మందికి మాత్రం కొంత వరకు బిల్లులు విడుదలయ్యాయి. ఆ తరువాత రోడ్లు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు కాళ్లు అరిగేలా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుల నారాయణరెడ్డి టీడీపీ నాయకులు చేసిన బిల్లులను అధికారంలోకి వచ్చిన తరువాత చెల్లింపులకు కృషి చేస్తానన్నారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో టీడీపీ నేతల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. అంతే ఆకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం నిధులతో బిల్లులు చెల్లించే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆవిధంగా నారాయణరెడ్డి చొరవతీసుకొని ఆరు సంవత్సరాల క్రితం ఆగిన బిల్లులను విడుదలలో చొరవ చూపేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు. కొంతమందికి బిల్లులు నిలిచిపోయాయని వాటిని ఆన్‌లైన్ చేసి బిల్లులు పెడుతున్నామని ఆర్థిక సంఘం నిధులు విడుదల అయితే చెల్లింపులకు ఆస్కారం ఉంటుందని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. నిధులు ఎంత మేరకు విడుదల అవుతాయో చూసి బిల్లుల చెల్లింపులు చేస్తామన్నారు. ఏది ఏమైనా ఆరు సంవత్సరాలుగా బిల్లులపై పోరాడుతున్న కాంట్రాక్టర్‌లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు వస్తాయనే భరోసా కలిగింది.


ఆరేళ్ల క్రితం వేసిన సిమెంట్‌రోడ్డు

హోటల్‌లో తనిఖీ

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ రోడ్డులోని ఆంధ్రా విలాస్ హోటల్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లోని పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశామన్నారు. ప్రతి హోటల్ వారు వంట గదితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టపావలి, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకపోతే కఠినచర్యలు

● ఏడీఏ బాలాజీ నాయక్


పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

పెద్దారవీడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులకు బిల్లులు ఇవ్వకపోతే కఠినచర్యలు తప్పవని ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. పెద్దారవీడులోని ఎరువుల దుకాణాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. బయోమందులు అమ్మేసమయంలో ప్రభుత్వ ఆమోదం పొందిన జీ-1, 2, 3 సర్టిఫైడ్ పురుగుమందులు మాత్రమే విక్రయించాలన్నారు. లైసెన్స్ లేని బయో పురుగుమందులు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో బుజ్జిబాయ్ పాల్గొన్నారు.

నరవతాండ సమీపంలో కారు బోల్తా

● ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం


నరవతాండ సమీపంలో బోల్తా పడిన కారు

పుల్లలచెరువు, నవంబరు 21: పుల్లలచెరువు మండలంలోని నరవతాండ సమీపంలో ఓ కారు బోల్తా పడింది. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం బేస్తవారపేట మండలం బోగోలుకు చెందిన వారు హైదారాబాద్ నుంచి బేస్తవారిపేటకు తమ కారులో వెళుతున్నారు. కోమరోలు మూలమడుగు తాండ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి చిల్లకంపలోకి దూసుకెళ్లింది. దీంతో కారు బోల్లాపడింది. అయితే ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పుల్లలచెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. గురువారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెద్దపీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వ వుంచిన 300 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నుంచి కనిపించకుండా పోయిన యువకుడి ఆత్మహత్య

పుల్లలచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న ఇంటి నుంచి పనుల నిమిత్తం బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం, పుల్లలచెరువుకు చెందిన కటారి బ్రహ్మయ్య అనే యువకుడు ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయారు. తండ్రి వెంకట శేషయ్య ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పుల్లలచెరువు మండలంలోని శతకోడు గ్రామ సమీపంతో కుళ్లిన స్థితిలో శవం ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్ వెళ్లి చూశారు. మృతదేహానికి సమీపంలో పురుగుల మందు డబ్బా ఉందని ఎస్ఐ తెలిపారు. బంధువుల సహాయంతో మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు.

ఫైబర్ నెట్ రాష్ట్రచైర్మన్‌ను కలిసిన బీజేపీ నేతలు


జీవీ రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురానికి చెందిన బీజేపీ నేతలు విజయవాడలోని ఏపీ ఫైబర్ నెట్ రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్ జీవీ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మార్కాపురం డివిజన్‌లో ఏపీ ఫైబర్ నెట్‌సేవలు త్వరగా ప్రారంభించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. గతంలో మంత్రి లోకేష్ అన్ని పట్టణాల్లో నెట్ సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు, నాగేశ్వరరావు, శ్రీకాంత్, సతీష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

24న మల్లవరంలో రెడ్డి సంఘం కార్తీక వనమహోత్సవం


మాట్లాడుతున్న చంద్రారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెడ్డి జనాభ్యుద సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వతేదీన మద్దిపాడు మండలం మల్లవరంలో కార్తీక వనభోజనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమ నిర్వహక సభ్యుడు గుడిపాటి చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక రెడ్డిహాస్టల్‌లో గురువారం రాత్రి జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నగరంలోని రెడ్డి కులస్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. లింగా రామరాకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్తీక వనమహోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, పాలవెల్లి నరసింహారెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

యువత సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఎస్సై వేమన


తర్లుపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పొదిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యువత సెల్‌ఫోన్ మోజులోపడి అనవసరపు లింక్‌లు ఓపన్ చేస్తే పలు అనర్థాలు ఎదురవతాయని సీఐ వెంకట్ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవలి కాలంలో సైబర్‌నేరాలు బాగా పెరిగాయన్నారు. యువత ఏ మాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా పరిణామలు తీవ్రంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు డ్రా చేస్తున్న ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగులకు దూరం గా ఉండాలని పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్ కారణంగా యువత పెడదోవపడుతోం దన్నారు. ఎన్నో జీవితాలు బలైపోతున్నాయని వివరిం చారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలను వినియోగించి జీవితాలను బలి చేసుకోవద్దని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని వాటి వలన కలిగే ఇబ్బందులను తల్లిదండ్రులు గుర్తించాలని వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరన్నారు. వాహన యజమానులు తమ పిల్లలకు మోటార్‌వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వేమన విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లుపాడు జడ్‌పీహెచ్ఎస్‌లో..

తర్లుపాడు : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బ్రహ్మనాయుడు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వికసించినప్పటికీ సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థి దశనుంచే అన్ని విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మహాధర్నాను జయప్రదం చేయాలి

కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు


మాట్లాడుతున్న చుండూరు రంగారావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో చేసే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక గిరిజన వృత్తి సామాజిక సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ చుండూరు రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రంగారావు మాట్లాడారు. నష్టాల్లో ఉన్న రైతులకు రుణమాఫీ చేయలేని పాలక వర్గాలు బహుళజాతి కంపెనీలకు లక్షల కోట్ల రుణమాఫీ చేస్తున్నాయన్నారు. పాలకవర్గాల తప్పుడు విధానాలను మార్చుకోవాలని కోరుతూ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిరుపతిరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి కొండయ్య, రైతు సంఘం నాయకులు వీరారెడ్డి, వెంకట్రావ్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలనాగయ్య, డీకేఎం రఫి, కొండారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కాశీం, వీరయ్య కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగనాట్లు


పొగనాట్లు వేస్తున్న కూలీలు

తర్లుపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది పొగాకు వేసిన రైతులకు కొంతమేర లాభాలు రావడంతో ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో పొగాకును సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపు ఖర్చు అయింది. ప్రస్తుతం నల్లరేగడి నేలలో పొగాకు నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. పొగాకు మూట ప్రస్తుతం రూ.3500 చొప్పున సుదూర ప్రాంతాలైన రాజమండ్రి, పొన్నలూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నారును వేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం రూ.5వేలు ఉన్న పొగాకు ధర ప్రస్తుతం స్వల్పంగా తగ్గింది. గతేడాది మూట నారు రూ.2000 ఉంటే ఈ ఏడాది రూ.5000లకు కొని నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది పొగాకు బ్యారన్ కౌలు రూ.1.25లక్షలు ఉంటే ఈ ఏడాది రూ.2లక్షలకు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా పొగాకు సాగు చేస్తున్నారు. గతంలో పొగాకు నాటని రైతులు కూడా ఈ ఏడాది కౌలుకు తీసుకుని నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో సీతానాగులవరం, తర్లుపాడులో ముమ్మరంగా పొగాకు నాట్లు వేస్తున్నారు. అధిక సాగు చేయవద్దని బోర్డు అధికారులు చెబుతున్నప్పటికీ రైతన్నలు మాత్రం అదేమి పాటించకుంఆ విపరీతంగా పొగాకు సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా పొగాకు బోర్డు అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కొందరు రైతులు కోరుతున్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలి

● ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకుల డిమాండ్
● ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నిరసన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని ప్రకాశంపంతులు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆరోపించారు. కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘటన మరవకముందే లావిద్యార్థినిపై ఇటువంటి దాడి జరగడం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి లైంగిక దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి వీరస్వామి, మాలతి, నాగూర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద్దగోవిందమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోనుకొట్టు.. మద్యం పట్టు

● గ్రామాల్లో కొరత లేకుండా మద్యం సరఫరా
● పదుల సంఖ్యలో అనధికారిక బార్‌అండ్ రెస్టారెంట్లు
● ముఖ్యమంత్రి ఆదేశాలను పట్టించుకోని అధికారులు


బోడపాడు సమీపంలోని అనధికారిక బార్‌అండ్ రెస్టారెంట్

మార్కాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తాగునీరు సక్రమంగా అందుబాటులో ఉంటుందో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం పుష్కలంగా లభిస్తోంది. ఏ గ్రామంలో చూసినా ఏరులై పారుతోంది. మార్కాపురం మండలంలో బెల్ట్‌షాపు లేని గ్రామం లేదంటూ అతిశయోక్తి కాదు.

ప్రభుత్వ నిబంధన ప్రకారం మద్యం దుకాణాలు నిర్వహించుకోవాలి. బెల్టు షాపులు నిర్వహించకూడదని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతస్థాయి అధికారులు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేశారు. అయితే ఆ నిబంధనలతో తమకేం సంబంధం అన్నట్లు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు, అనధికారక బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. మండలంలోని జాతీయ రహదారిపై కుంట వద్ద అనధికారక బార్‌అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. రాత్రి సమయాలలో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో బెల్టుషాపులు నిర్వాహకులు జోరుగా నడుపు తున్నారు. మండలంలోని బోడపాడు గ్రామ సమీపంలోని మార్కాపురం వెళ్లే రోడ్డు పక్కన ఓ అనధికారిక రెస్టారెంట్‌లో రాత్రిపగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలు సాగుతు న్నాయి. మందుబాబులకు చికెన్ బిర్యాని, పుల్కాలు అందజేసి టేబుల్‌లు వేసి సరఫరా చేస్తున్నారు. గ్రామాలలో కొందరు తమ ఇళ్ల వద్దే మందుబాబులకు నచ్చిన వంటకాలను తయారు చేస్తూ వారి జేబులను ఖాళీ చేస్తున్నారు. మరికొందరు గ్రామంలోని వాడే కదా అని వారి పరపతిని బట్టి అప్పులకు కూడా మద్యం అందజేస్తుండడం గమనార్హం. మందుబాబులు ఎక్కడ ఉన్నా ఒక్క ఫోన్ కొడితే వారి మందు సీసాలు సరఫరా అవుతున్నాయి. మండలంలోని చాలా గ్రామాలలో పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది. గ్రామాలలో కొందరు బెల్టు షాపుల నిర్వహణే తమ ఉపాధిగా మార్చుకున్నారు. ఒక్కో మద్యం సీసాకు రూ.50 నుంచి వంద రూపాయల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామాన్ని బట్టి ఐదు నుండి పది వరకు బెల్టు షాపులు కొనసాగుతుండడం గమనార్హం.

ఈ బెల్ట్‌షాపులపై సంబంధిత అధికారులు ఒకరోజు హడావుడి చేసి ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసినప్పటికీ, మరలా గ్రామాలలో అదేపరిస్థితి కొనసాగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామస్థాయిలో సచివాలయాలలో మహిళా పోలీసులతో పాటుగా దాదాపు పది మంది అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ వారి కళ్ల ముందే ప్రతి రోజూ ఈ తతంగం కొనసాతుండడం గమనార్హం.

అలరించిన సాయి సంకీర్తనలు


నగర సంకీర్తన చేస్తున్న సత్యసాయి భక్తులు

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ప్రేమసుధా మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. 4వ రోజు గురువారం తెల్లవారుజామున సత్యసాయి భక్తులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో భక్తిపాటలు పాడుకుంటూ నగర సంకీర్తన చేశారు. సాయంత్రం బాలవికాస్ బాలబాలికలతో ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు అలరించాయి. సామూహిక నామసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సేవాసమితి కన్వీనర్ అనంతరామయ్య, కమిటీ ప్రతినిధులు, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజోత్సవాలలో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాలలోని కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సామూహికంగా రమాసహిత శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగానే వ్రతాలలో పాల్గొనవచ్చని, పాల్గొనే దంపతులు పూజాసామగ్రి తెచ్చుకోవాలన్నారు.

27న రుద్రపూజ

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ మందిరం ఆవరణలో ఈ నెల 27న ఉదయం 6.30 గంటలకు సామూహిక రుద్రపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శివునికి అభిషేకం, రుద్రపూజ నిర్వహిస్తున్న దృష్ట్యా భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రికార్డులను పారదర్శకంగా ఆన్‌లైన్ చేయాలి

● సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

త్రిపురాంతకం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆన్‌లైన్ చేసే రికార్డులన్నీ సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని త్రిపురాంతకం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కుమార్, పరపతి సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వాతవారణ మార్పు నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కోటానాయక్ అన్నారు. బాలల సంపూర్ణ రక్షణ ఆరోగ్యరక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం ఎర్రగొండపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, తదితర పరీక్షలు నిర్వహించి రోగాలపై జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో హృదయరంజన్, ఏఎన్ఎం ఎం.సంధ్యరాణి, ఎంఎల్‌పీహెచ్‌డీ శంకర్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కె దాదా బాషా, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

● ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండ పాలెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం ఎర్రగొండపాలెంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన మీద నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పజెప్పిన పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గ పరిధిలో అన్ని మండలాల్లో గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. గతంలో సమావేశంలో నాయకులు చాట్ల అబ్రహం, శ్రీనివాసులు, ఉన్నారు.

1న టి.కృష్ణ వర్ధంతి

ఒంగోలు(కల్చరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ వర్ధంతి కార్యక్రమం డిసెంబరు 1వ తేదీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరులో జరగాల్సిన ఈ కార్యక్రమం భారీ వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈక్రమంలో 1వ తేదీన ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముఖాముఖి

త్వరితగతిన రీసర్వే అర్జీల పరిష్కారం

బి.రమాదేవి, తహసీల్దార్, దొనకొండ



ప్రశ్న: గ్రామ సభల్లో రీసర్వేపై ఎన్ని అర్జీలు అందాయి ?

జవాబు: మండలంలో మొత్తం ఎనిమిది గ్రామాల్లో రీసర్వే గ్రామ సభలు నిర్వహించాం. గ్రామసభల్లో మొత్తం 215 అర్జీలు రైతుల నుంచి అందాయి. ఎక్కువగా జాయింట్ పట్టాల సమస్యలపై అర్జీలు అందగా ఫీల్డ్ విజిట్ చేపట్టాం. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులను హాజరుపర్చి విచారణ చేసి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: సాగునీటి సంఘాల ఎన్నికలకు రైతుల జాబితా సిద్ధం చేశారా ?

జ: పూర్తిస్థాయిలో పరిశీలించి రెవెన్యూ పరిధిలో ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేశాం. ఈనెల 13న జాబితాను పబ్లిష్ చేస్తాం.

ప్ర: రైతుల భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వాస్తవమేనా?

జ: రైతుల నుంచి ఎటువంటి సమస్యకు సంబంధించిన అర్జీ అందిన వెంటనే వీఆర్వో, వీఆర్‌ఏల ద్వారా సమగ్ర విచారణ చేపట్టి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎటువంటి భూ సమస్యలు పెండింగ్‌లో లేవు.

మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన గోపతోటి లాజరస్ అనే వ్యక్తి కూరగాయల షాపులో మద్యం అక్రమంగా అమ్ముతున్నట్టు ముండ్లమూరు పోలీసులకు గురువారం సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో వెళ్లి తనిఖీచేశారు. షాపులో ఉన్న ఎనిమిది క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది ప్రేమానిధి, ఏసుబాబు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిరపలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి గోపిచంద్ అన్నారు. గురువారం వగ్గంపల్లి గ్రామంలో మిరప తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. అంతకుముందు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిరప సాగుచేసే రైతులు ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లించాలన్నారు. పండ్ల తోటల రైతులకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీవో సరోజిని అన్నారు. మండలంలోని పెదగోగులపల్లి ఎస్సీ కాలనీ లోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు చక్కటి విద్యబోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 24,25 తేదీల్లో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆసంఘం మండల అధ్యక్షుడు ఎన్ .వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. గురువారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల కాలనిర్ణయ పట్టిక మార్పులో విద్యాశాఖ పునరాలోచన చేయాలన్నారు. సుదూరు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు హాజరవుతున్నారని చెప్పారు. ఈ సమయ మార్పులతో బాలికలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. సమావేశంలో షేక్ పాదుషా, ఎన్.తిరు పతయ్య, వి.సాంబశివరావు, ఎం.శ్రీనివాసులు, జి.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పీసీపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నపురెడ్డిపల్లి శివార్లలో కోడిపందెం నిర్వహిస్తున్న శిబిరంపై పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య సిబ్బందితో గురువారం దాడిచేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.4,350 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

24న ఉచిత వైద్యశిబిరం

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసియన్ వాస్కులర్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్‌లో సూర్యచంద్ర సేవా సంస్థ తరుపున నిర్వహించే ఉచిత రక్తనాల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ తెలిపారు. గురువారం స్థానిక పద్మావతి గెస్ట్‌హౌస్‌లో ఉచిత వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

శునకాల స్వైర విహారం

- భయాందోళనలో వాహన చోదకులు
- పలువురు ఆస్పత్రుల పాలు
- పట్టించుకోని అధికారులు


ఉమామహేశ్వర అగ్రహారంలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలు

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సింహాలుగా పిలవబడే వీధి కుక్కలు వీధుల్లో రాత్రుల సమయాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి 7 గంటల దాటితే వీధి కుక్కలు రోడ్లపై గుంపులు గుంపులుగా చేరి వాహన చోదకుల వెంట పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు భయపడి వాహనాన్ని వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఒక్క వాహన చోదకులే కాక వీధుల్లో వృద్ధులను, చిన్నారులను. మూగ జీవాలైన గేదెలను కూడా వదిలి పెట్టడం లేదు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్లలతో పాటు మారెళ్ళ, బలరామ్‌నగర్ ఎస్సీ కాలనీ, పుదఉల్లగల్లు, పసుపుగల్లు, పులిపాడు, కమ్మవారిపాలెం, వేముల, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఒక్కో గ్రామంలో 50 నుంచి వంద వరకు రాత్రుల సమయంలో గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకుల బండ్ల వెంటపడి కరుస్తున్నాయి. కొత్తగా వెళ్ళేవారైతే వీధి కుక్కలు వెంట పడటంతో వాహనాలు వేగం పెంచి అదుపుతప్పి కిందపడి పోతున్నారు.

ఇటీవల పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారంలో పలువురు వాహన చోదకుల వెంటపడి గాయపరిచాయి. చిన్నపిల్లలు సైతం కుక్కల దాడిలో గాయపడ్డారు. మూగ జీవాలైన గొర్రెలు, గొర్రె పిల్లలు, మేక పిల్లలను కూడా వదలకుండా కాటువేసి చంపివేస్తున్నాయి. పోలవరం, ముండ్లమూరు, నాయుడుపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో రెండు వందల గొర్రె పిల్లలను కాటు వేయటంతో చనిపోయాయి.

ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను పట్టించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

బాబోయ్.. వానరాలు

కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో శునకాలు, వానరాలు బెడద తీవ్రంగా ఉంది. ఒకపక్క శునకాలు మనుషులను కరుస్తుంటే.. మరోపక్క ఆవులు రోడ్లకు అడ్డంగా నిలబడి వాహనదారులను ఇబ్బంది పెట్టిస్తున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రోడ్లపై ఆవులను వదిలివేసే యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి నిబంధలను తెలియచేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటివరకు కదలికలేదు. రోడ్లపై శునకాలు, ఆవులు విపరీతంగా సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిస్తుంటే, మరోపక్క కోతుల బెడద ఎక్కువైంది. కొండ ప్రాంతంలో ఉండే కోతులు జనారణ్యంలోకి వచ్చి మనుషుల పైకి దూకుతున్నాయి. చేతుల్లో కాయలు, తినే వస్తువులు, సంచులు ఉంటే లాక్కుని పరిగెడుతున్నాయి. ఆసమయంలో వాటిని అదిలిస్తే పైకి కరిచేందుకు వస్తున్నాయి. స్థానిక సాయిబాబా దేవాలయం, కొండదిగువ శివాలయం, దొంతులమ్మ దేవాలయం వద్ద కోతుల బెడద తీవ్రంగా ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు!


కనిగిరి: ఎంఎస్‌ఎం కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీరాం

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోవద్దని ఎస్‌ఐ వై.నాగరాజు సూచించారు. గురువారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలకు చదువుకున్న వారు కూడా మోసపోతున్నారని చెప్పారు. ఓటీపీ వచ్చిందని చెప్పి ఆధార్ కార్డు లేక బ్యాంక్ పాసు బుక్ నెంబరు తెలుసుకొని మోసగిస్తున్నారని అన్నారు. విద్యార్థులు వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగరాజు సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై అవగాహన కలిగిఉండాలి

పీసీపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వీయ రక్షణపై బాలికలు అవగాహన పెంచుకోవాలని ఎస్సై జి.కోటయ్య అన్నారు. గురువారం గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, వేధింపులు, బెదిరింపులకు గురికాకుండా ఉండేందుకు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మనకు తెలియని వ్యక్తులు చెప్పే మాటలకు మోసపోవద్దన్నారు. అనుమానాస్పదంగా కనిపించే కొత్త వ్యక్తులతో మాటా మంతీ కలపొద్దన్నారు. తెలియని నెంబర్ల నుంచి మెసేజ్‌లు, ఫోన్‌లు వచ్చినా స్పందించవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఫోన్ల ద్వారా జరుగుతున్నాయన్నారు. కొంత మంది చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. మాయమాటలకు నమ్మి మోసపోవద్దన్నారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.సుజిత, సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. గురువారం సీఎస్‌పురం మండలంలోని కదిరిబాబురావు విద్యాసంస్థలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా, బాలికలపై నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుల్లో రాణించి తల్లి దండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్.సుమన్, వ్యవసాయ, ఉద్యాన కళాశాలల డీన్‌లు పి. రఘుపతి, పి.వీరన్నగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు సమయస్ఫూర్తితో మెలగాలి

కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు పరిస్థితుల పట్ల అవగాహనతో సమయస్ఫూర్తితో మెలగాలని ఎస్‌ఐ టి.శ్రీరాం అన్నారు. స్థానిక ఎంఎస్‌ఎం డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. యువతీ యువకులు బైక్‌లు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని అన్నారు. వారి ఆశలను చెడు ప్రవర్తనలతో బాధ పెట్టించవద్దని చెప్పారు. సోషల్‌మీడియాలో పోస్టు చేయటం, ఫేస్ మార్ఫింగ్‌లు చేయటం చట్ట విరుద్ధమన్నారు. ఈవిషయంలో పోలీసుశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు.

కార్యక్రమంలో ఎంఎస్‌ఎం కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 30 మంది బాధితులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు గురువారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఒక వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం సీఎం మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మరో 30 మందికి రూ.26,41,131 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదప్రజల సహాయార్థం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహృదయంతో బాధితుల కోసం సహాయ నిధులు విడుదల చేయటం ఆనందదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన ఈ సహాయనిధి ద్వారా సుమారు 30 మంది జీవితాలు నిలబడుతున్నాయన్నారు.

కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, పిడతల నెలమలయ్య, కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- జడ్పీ సీఈవో చిరంజీవి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చిరంజీవి

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జడ్పీ, మండల పరిషత్ ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో చిరంజీవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు, జమా ఖర్చుల వివరాలు వెంటనే తెలపాలని ఆదేశించారు. స్వర్ణ పంచాయతీ, హౌస్‌ఓల్డ్ జియో సర్వే, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పలుచోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దర్శి, కురిచేడు, తాళ్ళూరు, దొనకొండ, ముండ్లమూరు ఎంపీడీవోలు ఎల్.కృష్ణమూర్తి, సతీష్‌బాబు, సుందరరామయ్య, శ్రీదేవి, జనార్దన్, దర్శి ఈవోఆర్డీ ఆవుల సుధాకర్ పాల్గొన్నారు.

చప్టాలో పూడికతీత పనులు


ఎక్స్‌కవేటర్‌తో చప్టా వద్ద తొలగిస్తున్న పూడిక తీత

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-కొత్తపాలెం మార్గంలో గల నేలబారు చప్టా పూర్తిగా పూడిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తాళ్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పూడిక తీత పనులు చేపట్టారు. ఈ చప్టా రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉంది. ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు చప్టా మీదుగా ప్రవహిస్తుంది. ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో ఆమురుగునీటి దుర్గంధం భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల కష్టాలను గమనించిన ఎంపీడీవో సుందరరామయ్య చప్టా వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామకార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ నిధులతో సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీకార్యదర్శి రమణారెడ్డి ఆధ్వర్యంలో చప్టా వద్ద ఇరువైపులా నిండిఉన్న పూడిక తీతను ఎక్స్‌కవేటర్‌తో తీయించారు. ఎంపీడీవో ఆదేశానుసారం కొత్తపాలెం, కొర్రపాటివారిపాలెం గ్రామాల్లో పంచాయతీ నిధులతో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేయిస్తున్నారు.

డ్వాక్రా సంఘాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

- ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో ఎక్కువగా వివిధ పనుల కోసం వలసలు వెళ్తుంటారన్నారు.

ప్రభుత్వం ఎలాంటి పూచీకత్తు లేకుండా నేరుగా డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ ప్రకాశం చెప్పారు. వాటిని సకాలంలో చెల్లిస్తే ఎలాంటి వడ్డీ లేకుండా మళ్లీ రుణాలు తీసుకోవచ్చన్నారు. ఆయా రుణాలు అందిపుచ్చుకున్న మహిళలు గ్రూపుగా ఏర్పడి గ్రామాలలో వివిధరకాల చిరు వ్యాపారాలు చేపట్టి వాటిని పట్టణ కేంద్రంలో మార్కెటింగ్ చేసుకుని ఆర్థిక పురోగతి చెందవచ్చునని చెప్పారు.

కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్, ఏపీఎం అశోక్, సీసీలు వజ్రమ్మ, బాషా, మస్తాన్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

సోలార్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా

దొనకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ప్రతిఇంటిపైన సోలార్ ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ సోలార్ ఏర్పాటుచేసుకునేందుకు తక్కువ ఖర్చు అవుతుందని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఉంటుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణం కూడా మంజూరవుతుందన్నారు. సోలార్ ద్వారా ఒక కిలోవాట్‌కు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ షేక్ నాగూర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగుకు ఆటంకం కలిగించినవారిపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చింతపాలెం గ్రామ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీల సాగుకు ఆటం కల్గించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన తహసీల్దార్ కె.సంజీవరావును కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపాలెం గ్రామంలో 50 ఎకరాల భూమి అగ్రవర్ణకులస్తులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నా పట్టించుకోలేదన్నారు. అయితే, భూమిలేని నిరుపేద ఎస్సీ, ఎస్టీలు 15ఎకరాల భూమి సాగుచేసుకుంటుండగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు యత్నించటం ఎంతవరకు న్యాయమన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన యడ్ల యల్లయ్య ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటున్న పంటను ధ్వంసం చేయగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదన్నారు. తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతూ వివాదంగా ఉన్న ఆక్రమణ భూములను పరిశీలిస్తానని తెలిపారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో జిల్లా మాలమహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అపనపర్తి ఆదామ్ మాదిగ, కాకుమాను రవి, గిరిజన సంఘం నాయకులు గంటా సుబ్బారావు, జనుమాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన కానిస్టేబుళ్లను అభినందించిన ఎస్పీ


కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

కురిచేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడిని కాపాడిన కానిస్టేబుళ్లను ఎస్పీ దామోదర్ అభినందించి సత్కరించారు. కురిచేడు నుసుం బజారుకు చెందిన ఓ వృద్ధుడు అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది కురిచేడు పక్కనే గల దర్శి బ్రాంచి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే సమయంలో ఆదారిన వెళుతున్న కురిచేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్ళు వివేక్, ప్రసన్నలు ఈతగాళ్ళను పిలిచి వృద్ధుడిని కాపాడారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో వృద్ధుడి ప్రాణాలు కాపాడటంతోపాటు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ మంచి పనితీరు కనపరచిన కానిస్టేబుళ్లను ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

'మోపాడు'ను ఆధునికీకరించాలి

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోపాడు రిజర్వాయర్‌ను ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ రిజర్వాయర్‌ను వెలిగొండ ప్రాజెకుకు అనుసంధానం చేసి 2 టీఎంసీల నీటిని అందించాలన్నారు. నిమ్జ్‌లో పరిశ్రమలను ఏర్పాటుచేయించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గురువారం స్థానిక అమ్మ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సీపీఎం మండల మహాసభల్లో మండల కార్యదర్శిగా ఖాదర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కె.మాల్యాద్రి, బి.నాగేశ్వరరావు, కె.శంకర్, సయ్యద్ గౌస్‌బాషా, సభ్యులుగా వై.వీరనారాయణ, షేక్ ఖాశీం సాహెబ్, పి.రామయ్య, ఎం.ప్రసాద్, వైజే రావు, సీహెచ్ కొండయ్యను ఎన్నుకున్నారు. మహాసభలో ముఖ్యఅతిథులుగా సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, ఊసా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పామూరులో డయాలసిస్ సెంటర్, వగ్గంపల్లిలో ప్రాథమిక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సమావేశంలో తీర్మానించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, దూబగుంటలో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

క్రీడాపోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో జరిగిన అంతర కళాశాల క్రీడా సమ్మేళనం పోటీలలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. రెండో సంవత్సరం చదువుతున్న యమున లాంగ్ జంప్‌లో మొదటిస్థానంలో నిలిచారు. క్విజ్ పోటీల్లో సత్యదీప్, మనోజ్‌కుమార్‌లు మొదటి స్థానంలో నిలిచారు. క్రీడాకారులకు ఆచార్య ఎన్జీ రంగా కళాశాల డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కరుణాకర్ బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కదిరి పార్థసారధి, డీన్ పి.రఘుపతి, బండారు రవీంద్ర, మౌనిక, అధ్యాపకులు ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు.

నకిలీ ఓట్లను తొలగించాలి

కురిచేడు, సెప్టెంబరు 24: మండలంలో నకిలీ ఓట్లను తొలగించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై మంగళవారం అన్నిపార్టీల నాయకులతో తహసీల్దార్ రజనీకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు పలు సూచనలు చేశారు. రెండు ఓట్లు ఉన్నవారివి, మరణించిన వారి ఓట్లు తొలగించాలని సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అటువంటి వారి వివరాలు తనకు తెలియజేస్తే వెంటనే తొలగిస్తామని చెప్పారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని, వారికి సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, పఠాన్ రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

రుద్రసముద్రంలో పారిశుధ్య పనులు

దొనకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో ఈవోఆర్డీ షఫీ పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు పారిశుధ్య సిబ్బందిచే పారిశుధ్య పనులు చేపట్టారు. 'మంచం పట్టిన రుద్రసముద్రం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది గ్రామంలో తిరిగి జ్వరపీడితులకు వైద్య సేవలందించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడినా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందిని సంప్రదించి వైద్యం పొందాలని గ్రామస్థులకు సూచించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై వైసీపీ నేతల ఫిర్యాదు

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌పై సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెట్టిన టీడీపీ, జనసేన కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు టీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబసభ్యులపై చేస్తున్న దుష్ప్రచారం, వికృత చేష్టలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గోళ్లపాటి మోషె, మాజీ జడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్‌రెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.



- ధాన్యం సేకరణకు కృత్రిమ మేథ సాయం
- వాట్సాప్ నంబరు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- 7337359375 నంబరుకు హెచ్‌ఐ అని నమోదు చేస్తే చాలు

స్మార్ట్‌గా కొనుగోళ్లు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఈ దఫా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం రైతులు పడిగాపులు పడాల్సి వచ్చేది. అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన పరిస్థితి. వీటికి ఫుల్‌స్టాప్ పెడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేథ) సాయాన్ని తీసుకుంటోంది. రాష్ట్ర పౌరసరఫాల సంస్థ వాట్సాప్ నంబరు 7337349375ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు ఈ నంబరు ద్వారా ధాన్యాన్ని ఎప్పుడు విక్రయించుకోవచ్చో వారే స్వయంగా తేదీ, సమయాన్ని ఎంచుకోవచ్చు. దీని వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులు వారికి ఉండవని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెప్తున్నారు. రైతులు వాట్సాప్ నంబరుకి ఆంగ్లంలో హెచ్‌ఐ అని నమోదు చేయగానే వెంటనే ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్, రీషెడ్యూల్ చేసుకోండి అని సందేశం వస్తుంది. షెడ్యూల్‌ని క్లిక్ చేయగానే దయచేసి మీ ఆధార్ సంఖ్యని నమోదు చేయమని కోరుతుంది. ఆధార్ నంబరు ఎంట్రీ చేయగానే సమీపంలో ఉన్న ధాన్యం కేంద్రాల జాబితా ప్రదర్శితమౌతుంది. వాటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న వెంటనే తేదీలను ఇస్తుంది. తేదీని ఎంచుకోగానే టైం స్లాట్ ఇస్తుంది. టైంస్లాట్ ఎంచుకున్న తర్వాత ధాన్యం రకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఎన్ని బస్తాలను అమ్మదలిచారో చెప్పాలని కోరుతుంది. పరిణామం తెలిపిన తర్వాత రైతు పేరు, గ్రామం, షెడ్యూల్ చేసిన తేదీ, కూపన్ కోడ్ వస్తుంది. ఒకవేళ రీషెడ్యూల్ చేసుకోవాలన్నా ఆ అవకాశం కూడా ఉంటుంది. ఈ-పంట నమోదులో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. రైతు తాను సాగు చేసిన విస్తీర్ణం తక్కువగా ఉండి, ఎక్కువ బస్తాల ధాన్యం విక్రయించాలని చూసినా ఏఐ అనుమతించదు.

- ఎక్కడికక్కడ వెలిసిన బెల్ట్ షాపులు
- టీడీపీ నేతల కనుసన్నల్లో నిర్వహణ
- పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం
- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు
- తూతూమంత్రంగా కేసులు, దాడులతో ఎక్సైజ్ సరి
- నియంత్రణలో వైఫల్యం.. మామూళ్ల వసూళ్లలో అధికారులు

వాడవాడలా.. మద్యం

ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చేశాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు. తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్స్‌కు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతీ పల్లెలోనూ, పట్టణాల పరిధిలోని కాలనీల్లోనూ ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలోని బడ్డీ కొట్టుకు వెళ్తే మందు దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉంటుండడంతో బెల్ట్ షాపుల నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. ఇదే అవకాశంగా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు బెల్ట్ షాపుల నిర్వహణకు ముందుకొస్తున్నారు. అధికారులు కూడా తూతూమంత్రంగా దాడులు, కేసులతో సరిపెడుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రతి గ్రామం, కాలనీల్లో ఎనీటైం మద్యం అందుబాటులో ఉంటుంది.







ఆంధ్రజ్యోతి ఫోకస్

డిపాజిట్ కడితేనే బెల్ట్

రేపల్లెలో బెల్టు షాపుల నిర్వహణ కోసం చిన్న గ్రామమైతే రూ.50,000, పెద్ద గ్రామానికి రూ.లక్ష డిపాజిట్ చేసేలా మద్యం షాపులు యజమానులు రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కర్లపాలెం మండల పరిధిలో రెండు గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణకు పోటీ అధికంగా ఉండడంతో పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో బెల్టు షాపుల నిర్వహణకు దాదాపు రూ.3 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గ్రామాలలో ఇంతకుముందే ఈ బెల్టు షాపులు నిర్వహించిన వారికే ప్రస్తుతం కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. బెల్టు షాపులు ఎక్కడ జోరుగా నడుస్తున్నాయోనని తెలుసుకుని వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మద్యం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. పల్నాడులో మద్యం దుకాణాల నిర్వాహకులు రూ.50 వేలు వసూలు చేసుకుని బెల్ట్‌షాపు నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పాటు అక్కడకు మద్యం సరఫరా చేస్తున్నారు.

రూ.50 వరకు అదనం..

రూ.లక్షలు కట్టి వైన్స్ లైసెన్సు పొందిన వ్యాపారులు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకుని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు బ్రాండ్లను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తమ ప్రాంతం నుంచి వైన్స్‌కు వెళ్లకుండా అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు అదనపు మొత్తాన్ని భారంగా భావించడంలేదు. ఏ సమయంలోనైనా కావాల్సిన మందు దొరుకుతుండటంతో మందుబాబులు బెల్ట్ దుకాణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి నెలరోజులు అవుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ వైన్స్ షాపు లకు అనుమతించింది. ఇదే సమయంలో అన్ని ప్రాంతాల్లో, గ్రామాలలో వాడవాడల మద్యం బెల్టు షాపులు కూడా వెలిశాయి. గతంలో ప్రభుత్వ వైన్స్ కావడం.. డిమాండ్ ఉన్న బ్రాండ్లు అందుబాటులో లేక పోవడంతో బెల్ట్ షాపులపై పెద్దగా ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వైన్స్ నిర్వహిస్తుండటం.. వారి ద్వారా కావాల్సినంత మద్యం, కోరిన బ్రాండ్లు దొరుకు తుండటంతో బెల్ట్‌షాపుల యథేచ్ఛగా వెలిశాయి. వైన్స్ లైసెన్స్‌దారులతో సిండికేటైన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల అండ ఉండటం, కొన్ని దగ్గర్ల వారి అనుచరులే దుకాణాల నిర్వహి స్తుండటంతో వీటిని అడ్డుకునే వారే లేకుండా పోయారు.

కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపుల బెడదతను తట్టుకోలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. ప్రతి గ్రామంలోనూ మూడు నుంచి నాలుగు వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. బెల్టు ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందని గ్రహించిన మద్యం వ్యాపారులు కూడా వాటిని ప్రోత్సహిస్తున్నారు. బెల్టు నిర్వహించుకునే వారి నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్ల క్రమంలో కొన్ని గ్రామాల్లో నేతలు, మద్యం వ్యాపారుల మధ్య వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

ఎనీటైం మద్యం..

బెల్ట్ దుకాణాలతో పలు కాలనీల్లో, పల్లెల్లో మద్యం మందుబాబులకు చేరువైంది. కొన్ని గ్రామాల్లో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా వ్యాపారులు అమలు చేస్తున్నారని సమాచారం. బెల్ట్‌షాపుల్లో 24 గంటలూ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు తెల్లవారుజాము నుంచే ఆయా షాపుల వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్నా అధికారులు, పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అమ్మేవారు కూడా తాము అధికారులను ప్రసన్నం చేసుకునే విక్రయాలు జరుపుతున్నామని చెబుతుండడం విశేషం. బెల్ట్ దుకాణాల బెడదపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నా మొక్కుబడి కేసులతో ఎక్సైజ్ అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దాడుల్లో పట్టుబడ్డ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో మూలాలను కనుక్కొని వాటిపై చర్యలు తీసుకోవడంలేదు.

- గుంటూరుకి సమీపంలోని గోర్లవారిపాలెం, రాజీవ్‌గృహకల్ప, పలకలూరు, రాజేశ్వరావుకాలనీ, ఓబులనాయుడిపాలెం, వెంగళాయపాలెం, బుడంపాడు, లాల్‌పురం, నగరంలోని శివారు కాలనీల్లో

(మిగతా 6వ పేజీలో)



దొరికితే.. పండుగే

ఇటీవల ముప్పాళ్ళ మండలంలోని ఓ గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుల్ ఒకరు కేసు పెట్టించుకుంటావా?, సార్‌తో సెటిల్ చేసుకుంటావా? అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన బెల్టు షాపు నిర్వాహకుడు కానిస్టేబుల్ చెప్పినంత డబ్బులు సమర్పించుకుని కేసు లేకుండా బయటపడ్డాడు. ఇలా అధికారులకు బెల్ట్ దుకాణంపై ఫిర్యాదు అందితే దానిని నియంత్రించకుండా కేసులతో బెదిరించి మామూళ్లు పిండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

పంచాయతీలకు కాసుల వర్షం

ప్రభుత్వం నుంచి రూ.70.04 కోట్లు విడుదల

తీరనున్న సమస్యలు.. నిధులపై పాలకవర్గాల హర్షం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధుల లేమితో కూనారిల్లిపోతున్న పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో కేంద్రం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ చేస్తామని, పల్లెలో ప్రగతి పనులు చేపటడతామని, పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేసింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలోని పంచాయతీలకు రూ.70.04 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీలకు అన్‌టైడ్ కింద రూ.28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద రూ.41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో లేని విధంగా పంచాయతీ లకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో పంచాయతీల పాలకవర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఒకదాని వెంట విడుదల చేస్తుండటంతో గ్రామాల్లో సమస్యలు తీరనున్నాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు ఇచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరి ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం



వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా వేరే అవసరాలకు మళ్లించుకుంది. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం.. అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారు. నిధులు విడుదల చేయడం హర్షణీయం.

-జాస్తి వీరాంజనేయులు, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

- పెన్షన్‌దారులకు శుభవార్త
- మూడు నెలల వరకు బకాయిలు పొందవచ్చు
- ఆ తర్వాతా పునరుద్ధరణ కు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 7.59 లక్షల మందికి ఉపయోగం

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రెండో నెలలో బకాయి సొమ్ము ఇచ్చేవాళ్ళు కాదు. వరుసగా మూడునెలలు పెన్షన్ పొందకపోతే వాళ్లని లబ్ధిదారుల జాబితా నుండి శాశ్వతంగా తొలగిం చేవాళ్ళు. కుదిరీ కుదరక అలా పెన్షన్ సొమ్ము, పెన్షన్ పొందే అవకాశం పోగొట్టుకున్నవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడు ఆ బాధ లేదు. పెన్షన్ దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్టీఆర్ భరోసాపెన్షన్ తీసుకుంటున్న వాళ్ళ ప్రయోజనం ఎక్కడా దెబ్బ తినకుండా నిర్ణయం తీసుకుంది. ఒక నెల, రెండునెలలు వరకు కుదిరీ కుదరక పెన్షన్ తీసుకోక పోయినా హైరానా పడాల్సిన అవసరం లేదు. రెండు నెలల వరకు తీసుకోక పోయినా మూడోనెలలో మొత్తం బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపాశారు. వరుసగా మూడు నెలలు వరకు పెన్షన్ పొందని వారిని మాత్రమే శాశ్వత వలసగా పరిగణించి పెన్షన్ నిలిపి వేస్తారు.

శాశ్వత వలస దారులకు మళ్ళీ అవకాశం

గత ప్రభుత్వం రెండు, మూడు నెలలు పెన్షన్ తీసుకోక పోతే లబ్ధిదారుల ప్రయోజనానికి శాశ్వతంగా గండి కొట్టేది. కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధన పూర్తిగా ఎత్తి వేసింది. మూడు నెలల పాటు పెన్షన్ తీసుకొని వారిని శాశ్వత వలస దారులుగా గుర్తిస్తారు. వారి పెన్షన్ తాత్కాలికంగా నిలిపివేసినా తర్వాత పునరుద్ధరణకు అవకాశం కల్పించారు. వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకుండా, శాశ్వత వలసదారులుగా పరిగణిస్తే, వారు మునిసిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకుంటే పెన్షన్ పునరుద్ధరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో...

ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని 7,59,963 పెన్షన్ దారులకు మేలు జరుగుతుంది. గుంటూరు జిల్లాలో 2,55,258, పల్నాడు జిల్లాలో 2,75,070, బాపట్ల జిల్లాలో 2,29,635 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందుతున్నారు.

పారదర్శకతకు తావులేదు.. గత ప్రభుత్వంలో అంతటా పక్షపాతమే రాజ్యమేలింది... ఇళ్ల నమోదులో కూడా రాజకీయ సిఫారసులకే ప్రాధాన్యమివ్వడంతో ఎంతోమంది అర్హులు సంక్షేమ పథకాలకు దూరంగా ఉండిపోయారు. వలంటీర్లు ఇష్టారాజ్యంగా ఇళ్ల సంఖ్యతో క్లస్టర్లు ఏర్పాటు చేయడమే కాకుండా తమ బంధువులను, స్నేహితులను మ్యాపింగ్ చేయడం ద్వారా ఇళ్ల నమోదు అంతా కూడా అస్తవ్యస్తంగా తయారయింది. స్థానికంగా నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఇళ్లను సైతం మ్యాపింగ్ చేసి ఎంతోమంది అనర్హులకు గత ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. వీటన్నింటిని సరిదిద్ది అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడడానికి ఇళ్లకు జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఇప్పటికీ దాదాపు 72 శాతం ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తి కాగా ఈనెల 25 నాటికి వందశాతం పూర్తి చేసే విధంగా యంత్రాంగం శ్రమిస్తోంది.

ఇక సంక్షేమం పక్కా...

- జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి జియో ట్యాగింగ్
- విధుల నిర్వహణలో 3,500మంది సచివాలయ సిబ్బంది
- ఇప్పటికి 72శాతం పూర్తి.. ఈ నెల 25 తుది గడువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ పరిధిలోకి తేవాల్సిందేనని ప్రభుత్వం సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా క్లస్టర్ల వారీగా ప్రతి ఇంటిని సచివాయల సిబ్బంది విజిట్ చేసి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంటి నంబరు వివరాలకోసం ఫొటో తీసి యాప్‌లో నమోదు చేసిన తర్వాత కుటుంబసభ్యుల్లో ఒకరినుంచి ధ్రువీకరణ కోసం వేలిముద్ర లేదా ఫేస్ రికగ్నేషన్ తీసుకుంటున్నారు. సగటున ఒక్కో ఉద్యోగికి 90 నుంచి 110 ఇళ్ల వరకు కేటాయించి ప్రక్రియ చేపడుతున్నారు

మొత్తం ఇళ్ల సంఖ్యను 5,52,533

బాపట్ల జిల్లాలో ఉన్న మొత్తం ఇళ్ల సంఖ్యను 5,52,533గా అధికారులు తేల్చారు. వీటన్నింటిని జియో ట్యాగింగ్ పరిధిలోకి తేవడమే లక్ష్యంగా ఇంటింటికి సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రక్రియ చేపడుతున్నారు. గురువారం నాటికి 3,95,100 ఇళ్లకు ట్యాగింగ్‌ను పూర్తి చేయగా 72 శాతం పూర్తి అయినట్లయింది. ఈ నెల 25 నాటికి వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఉన్న 477 సచివాలయాల పరిధిలోని 3,500 మంది సిబ్బంది దీనికి సంబంధించి విధులు నిర్వహిస్తున్నారు

సిబ్బందికి తప్పని పాట్లు...

ప్రస్తుతం జరుగుతున్న జియో ట్యాగింగ్‌ను గతంలో ఉన్న క్లస్టర్ల ఆధారంగానే చేపడుతుండడంతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బందకి ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గతంలో ఈ మ్యాపింగ్ మొత్తం ఓ ప్రహసనాన్ని తలపించే విధంగా వలంటీర్లు చేపట్టారు. వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు తోడు రాజకీయ పైరవీలే ప్రామాణికంగా ఓ ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్లస్టర్ మ్యాపింగ్ విషయంలో పక్కపక్క ఇళ్లను కాకుండా ఎక్కడో ఉన్న ఇళ్లను దానిలో కలపడం, స్థానికంగా నివాసం ఉండకుండా ఏళ్ల తరబడి ఊరు విడిచి వెళ్లిన వారి ఇళ్లను సైతం మ్యాపింగ్‌లో చూపెట్టడంతో ఇప్పుడు అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వాస్తవానికి ఇళ్ల జియో ట్యాగింగ్‌కు తొలుత ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెల 20తోనే ముగిసింది. కానీ ఫీల్డ్ లెవెల్‌లో అనేక ఇబ్బందులు సచివాలయసిబ్బందికి ఎదురవుతుండడంతో గడువును ఈ నెల 25 వరకు పొడిగించారు

పలు చోట్ల అభ్యంతరం...

గత ప్రభుత్వం అవలంభించిన ప్రతీకార విధానాల వల్ల ప్రస్తుతం ఇంటింటి సర్వేలు అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు ముందస్తుగా ఈ జియో ట్యాగింగ్‌పై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించకుండా నేరుగా సిబ్బందిని రంగంలోకి దించడంతో పలుచోట్ల వివరాలు ఇవ్వడానికి నిరాకరించే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అంతే కాకుండా సంక్షేమ పథకాలలో కోత వేయడానికే ఈ జియో ట్యాగింగ్ చేపడుతున్నారనే దుష్ప్రచారాన్ని గ్రామాల్లోని వైసీపీ శ్రేణులు చేస్తుండడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఇంటిదగ్గర కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఒకటికి రెండు సార్లు తిరగాల్సి వస్తోందని, కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగానే తమను చూసి ఇళ్లనుంచి బయటకు వెళుతున్నారని సిబ్బంది వాపోతున్నారు

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు....

పారదర్శకత కోసమే ఈ జియో ట్యాగింగ్ చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల ప్రజలు సహకరించకపోవడంపై అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. ముందుగానే ఈ విధానం వల్ల కలిగే మేలును ప్రజలకు వివరించి చెప్పడంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల వైఫల్యం స్పష్టంగా కనబడింది. ప్రజల నుంచి నిరాకరణ వ్యక్తమవుతుండడంతో బాపట్ల మున్సిపాలిటీతో పాటు పలు చోట్ల జియో ట్యాగింగ్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలని, ఇది పూర్తిగా ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత కోసమేనని ప్రకటనలను విడుదల చేశారు

తర్వాత దశ వడపోతే....

ఇటీవల జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం చేపట్టిన పరిశీలనలో దాదాపు 2,600మంది అర్హత లేకపోయినా పింఛన్ అందుకుంటున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఈ ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తి అయ్యాక గత ప్రభుత్వంలో ఎంతమంది అర్హత లేకుండా లబ్ధిపొందారనే అంశంపై అంచనాకు ప్రభుత్వం వచ్చే అవకాశముంది.



నిజాంపట్నంలో ఓ ఇంటికి జియో ట్యాగింగ్ ప్రక్రియ చేపడుతున్న సచివాలయ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్‌ఆఫీసర్ తులసీరామ్, అద్దంకి ఈఈ ఎన్ మస్తానరావు

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించండి

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని, వారికి అవగాహన కలిగించాలని జిల్లా నోడల్ ఆఫీసర్ టీవీ తులసీరామ్ విద్యుత్ అధికారులకు సూచనలు చేశారు. గురువారం సాయంత్రం మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ డీఈఈ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసే విషయంపై అధికారులతో సమావేశం జరిగింది. అద్దంకి ఈఈ నల్లూరి మస్తానరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా తులసీరామ్ మాట్లాడారు. సోలార్ సిస్టమ్‌ను ఇళ్లపై ఏర్పాటు చేసుకుంటే వినియోగదారులకు డబ్బులు ఆదా అవుతాయని, అంతేగాకుండా వారి ఇంటికి సరిపడా విద్యుత్‌ను వారే తయారుచేసుకోవచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వం సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకున్న వినియోగదారునికి నెలరోజులకే సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, యద్దనపూడి, సంతమాగులూరు, బల్లికురవ మండలాల ఏఈలు సురేష్ బాబు, దీపక్, శ్రీనివాసరావు, మార్టూరు జూనియర్ ఇంజనీర్ కిరణ్, కార్యాలయ జేఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లపై సౌరశక్తి యూనిట్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహం

అద్దంకి : ఇళ్లపై సౌరశక్తి యూనిట్‌ల ఏర్పాటుకు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ టీవీ తులసీరామ్ అన్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులు, సోలార్ వెండర్స్ తో అద్దంకి ప్రాంతంలో సోలార్ ఇన్‌స్టాలేషన్ కు సంబంధించి, భవిష్యత్ సమన్వయ ప్రణాళిక గురించి చర్చించారు. ఆసక్తి గల వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 1 కిలో వాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 నుంచి 10కిలోవాట్లకు రూ.78వేల సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ దామోదరం, ఏఈలు పాల్గొన్నారు.



అద్దంకి బ్రాంచి కెనాల్‌లో నీటి ప్రవాహం

ఏబీసీలో తగ్గిన నీటి ప్రవాహం

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్ (ఏబీసీ)లో నీటి ప్రవాహం తగ్గింది. సాగర్ డ్యామ్ వద్ద పవర్ జనరేషన్ లో వచ్చిన సమస్యతో నీటి విడుదల తగ్గించడంతో అద్దంకి బ్రాంచి కెనాల్‌కు బుధవారం సాయంత్రం నుంచి నీటి విడుదల తగ్గించారు. పల్నాడు జిల్లా పరిధిలో ఇద్దరు బాలికలు ఏబీసీలో పడిపోవడంతో నీటి విడుదల మరింత తగ్గించినట్లు తెలుస్తుంది. గురువారం సాయంత్రం ఏబీసీ హెడ్ వద్ద 500 క్యూసెక్కులు మాత్రమే విడుదల అవుతున్నాయి. శుక్రవారానికి నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఏబీసీ పరిధిలో అద్దంకి నియోజకవర్గంలో ఇటీవలనే వరినాట్లు అత్యధిక శాతం పూర్తి కాగా, మరికొన్ని చోట్ల కొంతమేర వరినాట్లు వేస్తున్నారు. అదే సమయంలో మొక్కజొన్న సాగుకు కూడా రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ పరిస్థితులలో నీటి విడుదలకు ఆటంకం ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి నీటి విడుదల జరిగినా చివరి ఆయకట్టుకు చేరే సరికి రెండు రోజుల పాటు పట్టే అవకాశం ఉందని, ఇప్పటికే సాగు చేసిన వరిలో కలుపు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పల్లెపాలెంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి టీడీపీ నేతల అభినందనలు

చినగంజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్-2024 పురస్కారం పొందిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు పల్లెపాలెం టీడీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో టీడీపీ సీనియర్ నాయకులు గొల్లపోతు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి విజనరీ లీడర్ అవార్డు పొందిన సందర్భంగా గురువారం కేకు కట్ చేసి కార్యకర్తలు, మహిళలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ఏలూరి అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దండుప్రోలు తిరుపతిరావు, గ్రామ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న మత్స్యకారులు

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

వాడరేవు(చీరాలటౌన్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు సంఘటితంతో ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో జాతీయ మత్స్యకార దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఓడ బలిజశాఖ, జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మత్స్యకార సంఘం నాయకులు మాట్లాడారు. మత్స్యకారులు మైక్రోస్కోప్, స్టెతస్కోప్ లేని రోజుల్లోనే నీటి ప్రవాహం, గాలి, వెలుతురు వంటి ప్రకృతి పరమైన ఆధారాలను గుర్తించి వేటను సాగించినట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు సంతోష్, ఎరిపిల్లి రమణ, కనకరాజు పాల్గొన్నారు.

అనధికారక లేఅవుట్లకు అధికారుల అండ

నష్టపోతున్న కొనుగోలుదారులు
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు మూడు ఎకరాలు, ఆరబై ప్లాట్లు అన్నట్లు ముస్తాబవుతున్నాయి. అందుకు సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులు అండగా నిలుస్తున్నారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు అందుకు నిదర్శనం. అందరికీ కనిపిస్తున్న అక్రమ లేఅవుట్లు అధికారులకు కనిపించకపోవడం విశేషం. ఈ క్రమంలో అంతిమంగా కొనుగోలుదారులు రూ.కోట్లలో నష్టపోతున్నారు. కొనుగోలు చేసినవారు నిర్మాణాలకు అనుమతిలేక అగచాట్లు పడుతున్నారు. సదరు స్థలాల్లో మౌలిక వసతులు కల్పన జరగదని తెలిసి ఆందోళన చెందున్నారు.

చీరాలకు చెందిన ఓ వైద్యుని తమ్ముడు వేటపాలెం మండలంలో ఓ అనధికారిక లేఅవుట్లో స్థలం కొనుగోలు చేశారు. తీరా అందులో నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు రావని అర్థమైంది. వసతుల కల్పన జరగదని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో అతను అక్కడ నిర్మాణం జరపలేనని ఆ స్థలాన్ని వేరే వారికి అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వారు వెయ్యి మందికి (క్రయ, విక్రయదారులతో కలిపి) పైగా ఉన్నారంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

బాధ్యత మాది కాదు..

అనధికారిక లేఅవుట్లకు సంబంధించి రెవెన్యూ పంచాయతీ వారు బాధ్యత మాది కాదుగా అని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. ప్రాథమికంగా లేఅవుట్ వేయాలంటే ముందుగా రెవెన్యూ శాఖకు కన్వర్షన్ రుసుం చెల్లించాలి. తరువాత నిర్దేశిత నిబంధనల మేరకు పంచాయతీ లేదా ఒడా నుంచి అనుమతి పొందాలి. అవేమీ లేకుండానే అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి.

ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం

ప్రస్తుతం వేస్తున్న, వేసిన లేఅవుట్లకు అధికారికంగా నాలా రుసుం చెల్లిస్తే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతాయి. కానీ అది జరగడం లేదు.

స్వామి కార్యం పేరుతో స్వకార్యం

రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి అందులో ఎలాంటి సందేహం లేదు. ఎక్కడికక్కడ వెలస్తున్న అనధికారిక లేఅవుట్లే అందుక నిదర్శనం. అక్రమ లేఅవుట్లకు రాజకీయ అండ ఉందని చెప్తూ స్వామి కార్యం.. స్వకార్యం అన్నట్లు సంబంధిత అధికారులు చెప్పుకుంటూ లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

పెనాల్టీలు.. పీవోటీలే ప్రక్షాళన

అక్రమ లేఅవుట్లను ప్రోత్సహిస్తున్నది ఎవరు? నియంత్రణకు చర్యలు లేవా..?. ప్రస్తుతం జనాల్లో జరుగుతున్న చర్చ ఇది. నిబంధనల మేరకు అక్రమ లేఅవుట్లకు పెనాల్టీ (అపరాధ రుసుం) వేయడం, సదరు లేఅవుట్‌ను పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) జాబితాలో చేర్చడం సరైన పద్ధతనే విషయం తెలిసినవారు అంటున్నారు. అలా చేస్తే అక్రమ లేఅవుట్లకు చెక్ చెప్పవచ్చని భావిస్తున్నారు.



పరిశీలించి చర్యలు చేపడతాం

నిబంధనలకు విరుద్ధంగా, పూర్తిస్థాయి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయడం, విక్రయించడం సరికాదు. అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్లకు సంబంధించి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- రమేష్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట



పెనాల్టీలు వేసి ప్రక్షాళన చేస్తాం

అనధికారిక లేఅవుట్లు చట్ట విరుద్ధం. వాటిని ఎవరు ప్రోత్సహించరు. అలాంటివి గుర్తించి నిబంధనల మేరకు పెనాల్టీలు వేస్తాం. అలా కొందరిపై చర్యలు చేపడితే వేరేవారు ఆ చర్యలకు పాల్పడరు. అందుకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖర్ నాయుడు, ఆర్డీవో, చీరాల



216 జాతీయ రహదారి పక్కన రోడ్డుమార్జిన్‌ను కలుపుకుని వేసిన అనధికారక లేఅవుట్

వాడవాడలా.. మద్యం

(5వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపులున్నాయి.

- పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సుగాలి కాలనీ, ఎరుకలకాలనీ, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

- మంగళగిరిలోని బాప్టిస్టుపేట, పాతమంగళగిరి, కుప్పురావుకాలనీ, వీవర్స్ కాలనీతోపాటు మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎనీటైం మద్యం లభిస్తోంది. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో బెల్ట్ షాపులున్నాయి. సీతానగరం ఘాట్ల వద్ద నిత్యం ఓపెన్ బార్ నడుస్తుంది. ఇక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచే మందుబాబులు ఫుల్‌గా తాగి గొడవలు పడుతుంటారు.

- తాడికొండ గ్రామంలో చింతచెట్టు సెంటర్, పడమర వీధి రామాలయం, రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీలో, పొన్నెకల్లు బైపాస్‌లో మూడు షాపుల్లో, సత్రం సెంటర్, జడలం బావి సెంటర్‌లో, లాం, నిడుముక్కల, మోతడక, పాములపాడు, బండారుపల్లిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు.

- కాకుమాను మండలంలోని కొమ్మూరు, రేటూరు, అప్పాపురం, గరికపాడు, బీకే పాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇటీవల కొమ్మూరులో బెల్టు షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రామాంజనేయులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

- నరసరావుపేట నియోజకవర్గంలోని ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని పల్లెల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో మద్యం షాపులు నిర్వహకుల మధ్య పోటీ నెలకొనడంతో ఒక వర్గం అధికారం అండతో బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తోంది. వీరు తప్ప మరేవరు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించకూడదని బెదిరిస్తుంది. నరసరావుపేట మండలంలో వ్యాపారులు సిండికేటై బెల్ట్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

- చిలకలూరిపేటలోని శివారు కాలనీలతో పాటు యడ్లపాడు మండలంలో ప్రతి గ్రామంలోనూ బెల్టు షాప్‌లు ఉన్నాయి. సాతులూరు వంటి గ్రామాల్లో ఏడు నుంచి పది బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

- పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, గురజాల, మాచవరం, మోర్జంపాడు, అంబాపురం, పులిపాడు, దైద, జంగమహేశ్వరపురంలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తెలంగాణ మద్యాన్ని కూడా కొందరు గుట్టుగా విక్రయిస్తున్నారు. కారంపూడిలో 3 మద్యం షాపుల నిర్వాహకులే పలు బడ్డీ బంకుల వద్ద మద్యం ఉంచి క్వార్టర్‌కు రూ.30 అదనంగా అమ్మిస్తున్నారు.

- రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై కేసులు నమోదయ్యాయి. దుర్గి మండల పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా హైవే రోడ్డు పక్కన దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొందరు యువకులు మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి నాగులేటి పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.

- బాపట్ల నియోజకవర్గ పరిధిలో ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కనకాద్రి నగర్‌తో పాటు సూర్యలంక తీర ప్రాంతంలో అనధికార మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో వైసీపీ హయాంలో ఎవరైతే బెల్టు షాపులు నిర్వహించారో వారే ఇప్పుడు కూడా బెల్టు దందాను నడుపుతున్నారు.

- చీరాలలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ టీడీపీ ద్వితీయశ్రేణి నేత బెల్టు షాపుల సిండికేట్ విషయంలో ఎడతెగని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ టీడీపీకి చెందిన వారితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా దాదాపు 7 షాపులు దక్కించుకున్నారు. వారిని కూడా ఈ బెల్టు సిండికేట్‌లో భాగస్వామ్యం అయ్యే విధంగా సదరు నేతే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.



గోల్డ్ షాపుల యజమానులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో దొంగలను గుర్తించే వీలుగా గోల్డ్ షాపుల యజమానులు ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కృష్ణయ్య అన్నారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన అద్దంకి లో తగ్గిన డే, నైట్ బీట్‌లు అనే కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గోల్డ్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. రద్దీగా ఉండే బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్, శింగరకొండ దేవాలయం తదితర ప్రాంతాలలో గురువారం పోలీస్‌లు ప్రత్యేకంగా పరిశీలనలు చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

» జడ్పీ సీఈవో చిరంజీవి

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జడ్పీ, మండల పరిషత్ ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని జడ్పీ సీ ఈవో చిరంజీవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజ కవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు, జమా ఖర్చుల వివరాలు వెంటనే తెలపాలని ఆదేశించారు. స్వర్ణ పంచాయతీ, హౌస్‌హోల్డ్ జియో సర్వే, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పలుచోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దర్శి, కురిచేడు, తాళ్ళూరు, దొనకొండ, ముండ్లమూరు ఎంపీడీవోలు ఎల్ .కృష్ణమూర్తి, సతీష్‌బాబు, సుందరరామయ్య, శ్రీదేవి, జనార్దన్, దర్శి ఈవోఆర్డీ ఆవుల సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీ ఈవో చిరంజీవి



గృహసముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శృంగేరి శారదా పీఠం విదుశేఖర భారతి మహాస్వామి

అర్చకుల గృహ నిర్మాణానికి శంకుస్థాపన

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న శృంగేరి శారదా పీఠాధిపతి

సంతమాగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో గురువారం పర్యటించారు. మిన్నేకల్లు గ్రామంలో తంగిరాల అనంత లక్ష్మమ్మ స్మారక కల్యాణ మండపంలో అర్చక గృహాలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో కల్యాణ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం శ్రీ విదుశేఖర భారతి చేతుల మీదుగా అర్చకుల గృహాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కల్యాణ మండపం ఇన్‌చార్జి, మార్కెటింగ్ యార్డు మాజీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, సీఈవో పీఏ మురళి పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 30 మంది బాధితులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు గురువా రం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఒక వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం సీఎం మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మరో 30 మందికి రూ.26,41,131 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడు తూ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదప్రజల సహాయార్థం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహృదయంతో బాధితుల కోసం సహాయ నిధులు విడుదల చేయటం ఆనందదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన ఈ సహాయనిధి ద్వారా సుమారు 30 మంది జీవితాలు నిలబడుతున్నాయన్నారు.

కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, పిడతల నెలమలయ్య, కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ఇద్దరు ఒడిశా కార్మికులకు గాయాలు

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపుతప్పిన ప్రమాదంలో ఇద్దరు ఒడిశా కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని కుంకుపాడు సమీపంలోని స్పిన్నింగ్ మిల్‌లో పనిచేసే ఇద్దరు ఒడిశా కార్మికులు సంపత్, మరో వ్యక్తి గురువారం మధ్యాహ్నం అద్దంకి నుంచి శింగరకొండ వైపు వెళ్తూ 99 అడుగుల అభయాంజనేయస్వామి దేవాలయం సమీపంలో స్కూటీ అదుపు తప్పి నామ్ రోడ్డు పై పడి పోయారు. తీవ్రగాయాలైన సంపత్, మరో యువకుడుని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న వాడరేవుకు చెందిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మండల పరిధిలోని పలుచోట్ల దాడులు నిర్వహించారు. ముగ్గురు పాత నేరస్థులను తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద బైండోవర్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలి

● ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శి క్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని ప్రకాశంపంతులు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆరోపించారు. కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘట న మరవకముందే లావిద్యార్థినిపై ఇటువంటి దాడి జరగడం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి లైంగి క దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి వీరస్వామి, మాలతి, నాగూర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద్దగోవింద మ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థినులు

అండర్‌పాస్ బ్రిడ్జి మంజూరుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ఎస్.అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిని మంజూరు చేయించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గురువారం ఘనంగా సత్కరించారు స్థానిక మాగుంట కార్యాలయంలో 16వ డివిజన్‌కు చెందిన ప్రజాప్రతిని ధులు, ప్రజలు ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఎన్నో ఏళ్ళుగా కలగా ఉన్న అండర్‌పాసు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమర నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు ఉంగరాల రవణయ్య, నాయకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మాదాశి చంద్ర, ఆల్లూరి హరి, కూనంశెట్టి చక్రవర్తి, దావూరి శ్రీనివాసరావు, శశి, ఏకాంబరం, సాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో వదిలిన లగేజీ బ్యాగ్ గుర్తించి బాధితులకు అప్పగించిన పోలీసులు

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి చీరాల్లోని బంధువుల ఇంటికి వచ్చిన దంపతులు తిరిగి వెళ్లే సమయంలో ఆటోలో లగేజీ బ్యాగ్‌ను మరిచి వెళ్లిన ఘటన గురువారం రాత్రి చీరాల టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన దంపతులు దాసరి లక్ష్మీ మృధుల, పవన్ ప్రసాద్ బుధవారం రాత్రి చీరాల కొత్తపేటలోని బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వెళ్లి ఫ్రెష్ అయ్యేందుకు రూంకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. లగేజీని మరిచి ఇంటికి వెళ్లారు. వెంటనే విషయాన్ని గ్రహించి టూటౌన్ సీఐ నాగభూషణంకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ గంటల వ్యవధిలో పందిళ్లపల్లికి చెందిన ఆటోను గుర్తించారు. డ్రైవర్ గిరికు ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే అతను లగేజీని పోలీసులకు అప్పగించారు. బ్యాగులో 8 గ్రాముల బంగారం, రూ.6 వేలు నగదు దుస్తులున్నట్లు బాధితులు చూసుకోగా సీఐ వారికి అప్పగించారు.

బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం సర్కిల్ పరిధిలో పలు మద్యం దుకాణాలను సిబ్బందితో కలసి సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపులను ప్రోత్సహించినా, మద్యం అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశారన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న 24 దుకాణాలకు సంబంధించి నిబంధనల మేరకు చేపట్టాల్సిన చర్యలు పూర్తయ్యాయన్నారు. ఇకపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ లేదా స్థానికంగా తాము ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. దుకాణదారులకు పలు హెచ్చరికలు, సూచనలు చేశారు.

నేడు విద్యుత్ కోత

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాల్లో విద్యుత్ కోత విధించినట్లు డీఈఈ సురేంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంత్యక్రియలకు అవస్థలు

» చిట్టడవులను తలపిస్తున్న మరు భూమి స్థలాలు

» శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి

బల్లికురవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతిమ సంస్కారానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలలో మరుభూముల స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామాలలో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలకు బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. కనీసం దారి కూడా లేకపోవడంతో కొందరు యంత్రాలను తీసుకు వచ్చి లోపలికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచారని, ఆ తర్వాత వైసీపీ వచ్చాక శ్మశానవాటికలు అడవుల్లా తయారయ్యాయని ప్రజలు వాపోతున్నారు.

బల్లికురవ మండలంలోని అంబడిపూడి హిందూ శ్మశాన వాటిక పూర్తిగా అడవిలా మారింది. కనీసం దారి కూడా లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మ చెట్లు పెరగడంతో లోపలికి వెళ్లే వీలు లేక ప్రజలు మృతదేహాలను యంత్రాల ద్వారా లోపలికి తీసుకు వెళ్లి దహన సంస్కారాలను పూర్తి చేస్తున్నారు. అలానే ముక్తేశ్వరం గ్రామంలో శ్మశానవాటిక చుట్టూ తుమ్మపొదలు అలుముకున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన రూములు సైతం శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైదన గ్రామంలో శ్మశాన స్థలం కనుమరుగు అయిందని ప్రజలు వాపోతున్నారు. పిచ్చి చెట్లు, చిల్ల చెట్లు పెరిగడంతో అంత్యక్రియలు సాహసంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. గుంటుపల్లి, కొప్పెరపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొప్పెరపాడు, కూకట్లపల్లి, కొత్తూరు, వెలమవారిపాలెం, ఉప్పుమాగులూరు, కొణిదెన తదితర గ్రామాల్లోని శ్మశానవాటికలూ అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2016లో పలు గ్రామాలలో శ్మశానవాటికలను అభివృద్ధి చేశారని, ఆ తర్వాత పట్టించుకునేవారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం శ్మశానవాటికలను తక్షణమే అభివృద్ధి చేసి, వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.







1. వైదనలో చిల్ల చెట్ల మధ్య కనుమరుగైన హిందూ శ్మశానవాటిక
2. దారి మూసుకుపోయి ఉన్న అంబడిపూడి శ్మశానవాటిక
3. ముక్తేశ్వరంలో అభివృద్ధికి నోచుకోని వాటిక



అంబడిపూడిలో చిట్టడవిని తలపిస్తున్న శ్మశానవాటిక



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

భూమిని పరిశీలించిన ఆర్డీవో

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేణంగివరంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం భూమిని పరిశీలన చేశారు. గ్రామానికి చెందిన బి.పద్మజ సర్వే నెంబరు 103 - 6ఏ లో తనకున్న ఎకరం ముప్పై రెండున్నర సెంట్ల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ఆర్డీవోకు దరఖాస్తు చేశారు. ఆమె విజ్ఞప్తి మేరకు ఆ భూమిని ఆర్డీవో తహసీల్దార్ పీ సింగారావుతో కలసి పరిశీలించి, రికార్డులను చూశారు. వీరి వెంట వీఆర్వో సుమతి, సర్వేయర్ రాజా పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆర్డీవో చొరవతో పట్టుకున్న తహసీల్దార్



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్

వేటపాలెం(చీరాల), నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆదేశాల మేరకు గురువారం 5 ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ పార్వతి పట్టుకున్నారు. 216 జాతీయ రహదారిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పార్వతిని ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ పార్వతి ఆ ట్రాక్టర్ల యజమానులకు అపరాధ రుసుము విధించారు. మరో సారి పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

డివైడర్‌లు అందంగా

చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



డివైడర్ వద్దను చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్‌లో సర్వీసు రోడ్డు పక్కన డివైడర్‌పై ఉన్న గడ్డిని, చెత్తా చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవరకూ తూర్పువైపున సర్వీసు రోడ్డులో జడ్పీ హైస్కూల్ నుంచి రాజుగారిపాలెం రోడ్డు వరకు, పడమరవైపున శ్రీహర్షిణి విద్యా సంస్థల నుంచి విజయలక్ష్మి కల్యాణ మండపం వరకు రోడ్డు పక్కన డివైడర్‌లపై చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. పెరిగిన గడ్డిని తొలగిస్తున్నారు. వాస్తవంగా హైవే అధికారుల ఆధ్వర్యంలో వారి సిబ్బంది ఈ పనులు చేయాల్సి ఉంది. కాని వారు పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్మికులు డివైడర్‌ను శుభ్రం చేశారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు దోహదపడే హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐఎస్ఐ సంస్థల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జాయింట్ కో-ఆర్డినేటర్ న్యాయవాది కరుణరావు, ఆర్టీఐ రిసోర్స్ పర్సన్ దాసరి ఇమ్మానియేల్ అన్నారు. పట్టణంలోని పచ్చతోరణం కల్యాణ మండపంలో ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు వారి సహకారంతో స్వచ్ఛంద సంస్థలు కార్డ్స్, జేఎంజే, కామదేను సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల హక్కులపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హక్కులను ఏవిధంగా వినియోగించుకోవాలి, వాటి ప్రాధాన్యతపై శిక్షణ అందించారు. శనివారంతో శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల కోటేశ్వరరావు, సుజాత, ఉమా, యువతీయువకులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రయోజనాన్ని రైతులకు చెప్పండి

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు అందరూ పంటల బీమా పథకం అవగాహన పెంచుకొని వినియోగించుకునేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. గురువారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అద్దంకి, పర్చూరు, మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రామకృష్ణ మాట్లాడారు. రబీలో పంటలకు బీమా చెల్లించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉప్పు నీటిపరిశోధనా స్థానం బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు పీ మధువాణి మాట్లాడుతూ భూసార పరిరక్షణ, సమస్యాత్మక నేలల యాజమాన్యంపై మాట్లాడారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మల మాట్లాడుతూ రబీ పంటలపై సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు టీ రత్నకుమారి, మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, అద్దంకి ఏడీఏ కె.ధనరాజ్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ



భూ వివాదంపై విచారణ జరుపుతున్న తహసీల్దార్ సింగారావు

భూ వివాదంపై తహసీల్దార్ విచారణ

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కశ్యాపురం గ్రామంలో తలెత్తిన భూ వివాదంపై తహసీల్దార్ పి.సింగారావు గురువారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన రైతు ధూళిపాళ్ల గంగయ్యకు సర్వే నెంబరు 748లో 5 ఎకరాల 93 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి విస్తీర్ణం విషయంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు గంగయ్య దరఖాస్తు ఇచ్చారు. ఈ విషయమై తహసీల్దార్ సింగారావు ఆ భూమిని పరిశీలించారు. విస్తీర్ణ వ్యత్యాస విషయమై రైతులతో విచారించారు. తగు చర్యలు చేపడతామన్నారు. వీరి వెంట వీఆర్వో సుమతి, సర్వేయర్ రాజా పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి సిబ్బందిని ఆదేశించారు. పంగులూరులోని సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎపీఈడీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి. హాజరు నమోదు చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రలోని రికార్డులను పరిశీలించి నిల్వ ఉన్న స్టాక్‌ను తనిఖీ చేశారు. వీరివెంట ఈవోఆర్డీ కె.సుమంత్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని సంతబజార్‌లో గల శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి 99వ విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని దేవస్థాన కమిటీ ప్రతినిధులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ధ్యాన మండలి వారిచే భజన కార్యక్రమం, తరువాత కుంకుమార్చన, శాంతి హోమం, రాత్రి సమయంలో మహిళ భక్తులతో దీపోత్సవాన్ని వైశంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు గుంటూరు మాధవరావు, రాజా, నారాయణ, శేషారత్నం, పవన్, ధనలక్ష్మి, సీతా మహాలక్ష్మి, ప్రభాకరరావు పర్యవేక్షించారు.

అక్రమ లేఅవుట్లకు చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» ప్రత్యేక కార్యాచరణ

» ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లేఅవుట్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో అడుగులు వేస్తున్నామని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో రియల్ వ్యాపారుల నయా దందా శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అనధికారిక లేఅవుట్లతో కొనుగోలుదారులు నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టేందుకు గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రాథమికంగా కనీసం కన్వర్షన్ రుసుము కూడా చెల్లించకుండా అక్రమ లేఅవుట్లు వేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అందులో భాగంగా నిబంధనల మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. తరువాత కూడా నిబంధనలను అనుసరించి మాత్రమే లేఅవుట్లు వేయాలన్న విషయాన్ని పక్కాగా చెప్తామన్నారు. కొనుగోలుదారులు అన్ని అనుమతులు ఉన్న లేఅవుట్లలో మాత్రమే స్థలాలు కొనుగోలు చేయాలన్నారు. సరైన సమాచారం తెలుసుకోకుండా అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావద్దని, నష్టపోవద్దని కొనుగోలుదారులకు సూచించారు. అలానే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అక్రమాలకు పాల్పడే ఎవరిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. తొలిసారి పట్టుబడిన వారికి అపరాధ రుసుము, హెచ్చరికలతో వదిలేస్తామన్నారు. మరలా పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అనధికార లేఅవుట్లకు అధికారుల, సిబ్బంది ఎవరు సహకరించినా వారికి షోకాజ్ నోటీసులిచ్చి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో స్పష్టం చేశారు.

మండల స్థాయి విజేతలు

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు. ఈ పోటీలలో వ్యాసరచన పోటీలలో డి.సాయిశ్రీ (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల), వక్తృత్వంలో ఏ.అమృత (జడ్పీహెచ్ఎస్ చక్రాయపాలెం), క్విజ్ పోటీలలో ఎం.సాయి సమీరా, (ప్ర భుత్వ బాలికల ఉన్నత పాఠశాల), డిబెట్‌లో ఎం.సాయి సమీరా, పి.లక్ష్మిదేవి, దేశభక్తి గీతాలు డి. మహాశ్రీ (గురుకుల పాఠశాల, అద్దంకి) విజేతలుగా నిలిచారని తెలిపారు.

పోలేరమ్మ దేవాలయంలో అన్నదానం

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం అద్దంకి పట్టణంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సుమారు 2500 మందికి అన్నదానం చేశారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

పింఛన్‌కు దరఖాస్తులను స్వీకరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా పింఛన్‌ల కోసం దరఖాస్తులను స్వీకరించాలని ఎంపిడీవో బత్తిని సింగయ్య తెలిపారు. గురువారం మండలంలోని శింగరకొండపాలెం సచివాలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పరిస్థితిని రికార్డుల ద్వారా పరిశీలించారు. ఎస్సీ కుటుంబాల రీ సర్వే వెరిఫికేషన్‌ను గురించి ఆరా తీశారు. నూతనంగా పింఛన్‌ల కోసం, గృహాల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బంది సూచించారు.

చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణ మహోత్సవం

చినగంజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు నారాయణం సత్యబాబు, సారంగపాణి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు దీవి హనుమత్ ప్రసాద్ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులరా తిలకించారు. ఈ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. కార్యనిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్చూరులో చెలరేగిన దొంగలు

» నాలుగు దుకాణాల్లో దొంగతనం

» సీసీ కెమెరాలో డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీ

» క్లూస్ టీం ఆధారాల సేకరణ

పర్చూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో దొంగలు చెలరేగిపోయారు. వరుసగా నాలుగు దుకాణాల్లో షట్టర్లను తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. పర్చూరు - చీరాల రోడ్డులోని ఆటోమొబైల్ షాపుతో పాటు, సమీపంలో ఉన్న చిల్లర దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగలు, ఇంకొల్లు రోడ్డులోని డ్రైఫ్రూట్స్ దుకాణంతోపాటు, సమీపంలోని ఆర్‌ఆర్ సెల్ షోరూంలోకి కూడా చొరబడ్డారు. ఆయా దుకాణాల్లో దొరికిన కాడికి నగదుతో పరారయ్యారు. ఆటో మొబైల్ దుకాణంలో కంపెనీ వారికి చెల్లించేందుకు షాపులో భద్రపరిచిన రూ.85వేల నగదుతో పాటు, సీసీ కెమెరాకు సంబంధించిన రూ.10వేల విలువ చేసే డీవీఆర్ అపహరణకు గురైందని బాధితుడు వాపోయారు. డ్రైఫ్రూట్స్ షాపులో రూ.20వేలకు పైగా నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. సెల్‌షాప్‌లో సీసీ కెమెరా డీవీఆర్, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. మరో చిల్లర దుకాణంలో రూ.2వేల నగదు మాత్రమే అపహరణకు గురైంది. ఉదయాన్నే షాపును తెరిచేందుకు వచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో ఆ దుకాణాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. ఎంత నగదు చోరీకి గురైందీ విచారణలో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఆధారాలు లేకుండా జాగ్రత్త

దుకాణాల్లోకి ప్రవేశించిన దొంగలు తమకు సంబంధించిన ఆనవాళ్లు, ఆధారాలు లేకుండా అక్కడున్న సీసీ కెమెరాల్లోని డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీలకు పాల్పడడంపై అందరూ భయాందోళనకు గురయ్యారు.

నైట్ బీట్‌పై విమర్శలు

సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే.. రాత్రి 12.45 గంటలకే చోరీ జరిగినట్లు నమోదు అయింది. ప్రధాన రహదారిలో ఒకేరోజు రాత్రి నాలుగు దుకాణాలలో చోరీ జరగడంతో అసలు నైట్ బీట్ పోలీసుల పర్యవేక్షణపై సర్వత్రా విమర్శలు కురిపిస్తున్నాయి.



డ్రైఫ్రూట్స్ దుకాణంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

ఒకే రోజు నాలుగు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడడంతో ఇటు ప్రజలతో పాటు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. మరో పక్క సమీపంలోని అద్దంకి పట్టణంలో గత రాత్రి దొంగలు బీభత్సం చేసి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడం ప్రజలకు కలవరానికి గురిచేస్తోంది. సిబ్బంది కొరత కూడా ఒకింత పోలీసులకు తలనొప్పిగా మారింది. చాలీచాలని పోలీసులతో నిఘాను మమ అనిపిస్తున్నట్లు కన్పిస్తుంది.



ట్రాన్స్‌'ఫార్మర్ల' కష్టాలు

వర్షాలకు కాలిపోతున్న నియంత్రికలు

మరమ్మతు చేయడంలో అంతులేని అలసత్వం

విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. వ్యవసాయ సర్వీసులు మంజూరులోనే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులోనూ ఆ శాఖ అధికారులు అంతులేని అలసత్వం ప్రదర్శిస్తున్నారు. రోజుల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు కోసం సమయం పడుతుండటంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ప్రధానంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రైతులంతా బోర్లపైనే ఆధారపడే పంటలు సాగు చేస్తారు. అలాంటి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుల్లో నెలకొన్న జాప్యం కారణంగా పంటలకు సకాలంలో నీరు అందించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు స్పందించకపోవడంతో రైతులే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేటు వాహనాల్లో తీసుకొచ్చి మార్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా రైతులపై రవాణా చార్జీల భారం రూ.వేలల్లో ఖర్చవుతోంది.

6

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



జోనల్ చైర్మన్‌గా సంతకం చేస్తున్న సురేష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడుపుతా!

- పేదింపులుండవ్.. అందరం కలిసికట్టుగా పని చేద్దాం
- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం
- నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి
- అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ

వివరాలు 6

ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

- ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ ఆదేశం

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాసిరకంగా పనులు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వ్యవహారంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టర్ నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయకుండా దాచిపెట్టిన ఫైల్ బయటకొచ్చింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన ప్రభుత్వం.. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నెల 12వ తేదీన 'ఫైలు తొక్కిపెట్టి.. రూ.కోట్లు కొల్లగొట్టి!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆత్మకూరు-సోమశిల రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతి వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) చర్యలకు ఉపక్రమించారు. నాసిరకంగా రోడ్డు పనులు జరిగినట్లు క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీ జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల ప్రకారం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ నివేదిక ప్రకారం మళ్లీ కొత్తగా రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వనున్నట్లు ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. సదరు కాంట్రాక్టర్ రోడ్డు వేయకపోతే రికవరీకి వెళ్తారు.

మీ నిర్లక్ష్యానికి సమాధానం చెప్పండి

- డీసీ, ఎంహెచ్‌వోకు కమిషనర్ 'షోకాజ్'

నెల్లూరు(సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'విధి నిర్వహణలో మీ నిర్లక్ష్యానికి కారణమేమిటి..? లిఖితపూర్వక వివరణ ఇవ్వండి' అంటూ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్‌వో చైతన్య, ఆర్వో రాజేశ్వరి, ఆర్ఐ పద్మావతి, అడ్మిన్ సతీష్‌కు షోకాజు నోటీసులు గురువారం జారీ చేశారు. అందిన సమాచారం మేరకు... మంగళవారం ఉదయం 5.30 గంటలకు కమిషనర్ సూర్యతేజ నగరంలో పారిశుధ్య పనులను పరిశీలించను బయలుదేరారు. అయితే దారి పొడవునా ఎక్కడా పారిశుధ్య కార్మికులు రోడ్లమీద విధుల్లో కనిపించలేదు. ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఆయన వెంటనే ఎంహెచ్‌వోకి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. ఈ తంతు గంటకు పైగా సాగింది. అయిన ఎంహెచ్‌వో అందుబాటులోకి రాకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి ఎంహెచ్‌వోకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రెండు రోజుల క్రితం భవన నిర్మాణాలను పరిశీలిస్తూ కమిషనర్ సూర్యతేజ చిల్డ్రన్స్‌పార్కు వద్దనున్న ఓ ఆసుపత్రికి వెళ్లారు. ఆ భవనానికి ఆస్తిపన్ను లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేసి రెవెన్యూ విభాగంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిర్లక్ష్యానికి వివరణ కోరుతూ డీసీ చెన్నుడు, ఆర్వో రాజేశ్వరి, ఆర్ఐ పద్మావతి, స్థానిక సచివాలయ అడ్మిన్ సతీష్‌కు షోకాజు జారీ చేశారు.

నాటి పాపాలు నేడు తుడిపేస్తూ..

- భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు
- జగన్ బొమ్మ, పేరుతో రూపకల్పన
- అన్నదాతల అభ్యంతరం, ఆందోళన
- వాటిని చెరిపేందుకు ఖర్చు రూ.59 లక్షలు
- నాటి ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం



కొండాపురం యంత్రంతో సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తుడిపేస్తున్న కూలీలు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల నాటి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమంటూ గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే... రెవెన్యూ, సర్వేశాఖలకు తలనొప్పిగా మారింది. రీసర్వేకు ప్రజాధనాన్ని వెచ్చించిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రక్రియను జగన్ నామస్మరణకు వాడుకుంది. డ్రోన్ల ద్వారా ఈ సర్వే జరిగింది. ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) దగ్గర నుంచి సర్వే పూర్తయిందని తెలిపే 13వ నోటిఫికేషన్ జారీ వరకు జిల్లాలో అన్నీ తప్పులే జరిగాయి. తక్కువ సమయంలో పూర్తి చేయాలంటూ నాటి ప్రభుత్వం ఒత్తిడి తేవటంతో రీసర్వే అవకతవకలుగా కొనసాగింది. రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

జగన్ పేరుతో రాళ్లు

రీసర్వేతో సరిపెట్టకుండా సర్వే రాళ్లపై, పట్టాదారు పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మ, పేరును వైసీపీ ప్రభుత్వం ముద్రించింది. తాము చేసిందే సర్వే, తన బొమ్మతో ఉన్న పాస్‌పుస్తకమే రాజపత్రం, తన పేరుతో వేసిన సరిహద్దు రాళ్లే కొలతలకు గీటురాళ్లు... అన్న చందంగా నాడు వ్యవహరించారు. ఏ దశలో కూడా నిబంధనలు పాటించలేదు. రీసర్వే చేసిన తరువాత సర్వేరాళ్లు వేయడానికి వైసీపీ పాలకులు భారీగా ప్రజాధనం వెచ్చించారు. వీటివల్ల రైతులకు మేలు జరుగుతుందా? లేదా అనే విషయాన్ని పట్టించుకో కుండా జగన్ పేరుతో ఉన్న రాళ్లను రైతుపొలంలో ఉండి తీరాల్సిందే అన్న ధోరణిలో వ్యవహరించారు. జగన్ పేరుతో సర్వేరాళ్లు వద్దంటూ రైతులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది.

కూటమి ప్రభుత్వం హామీ

తాము అధికారంలోకి వచ్చాక జగన్ బొమ్మతో ఇచ్చిన పాసుపుస్తకాలు రద్దు చేసి, సర్వేరాళ్లపై బొమ్మలు తొలగిస్తామని ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ ప్రకారం జగన్ బొమ్మలు, పేర్లు తొలగించేలా గత నెల 16వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాళ్లు దెబ్బ తినకుండా శాండ్ పేప రు, యంత్రాలతో జగన్ వివరాలను తొలగిం చాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో బృందం రోజుకు 200 రాళ్ల వంతున పేర్లు తుడిపేసేలా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 3,97,584 రాళ్లు పాతగా, ఇప్పటివరకు 6,384 రాళ్లపై పేర్లు తొలగించారు. పొలాల్లో నాట కుండా నిరుపయోగంగా ఉన్న రాళ్లపై కూడా పేర్లు తుడిపేస్తున్నారు. ఈ తుడిపి వేతకు ఒక్కో రాయికి రూ.15 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ ప్ర క్రియను డిసెం బరు 31వ తేదీలోపు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు.

సర్వే జరిగిన గ్రామాలు	: 328
నాటిన రాళ్లు	: 3,97,584
ఒక్కోరాయి ఖర్చు	: రూ.180
మొత్తం ఖర్చు	: రూ.7,15,65,120
ఇప్పటివరకు పేర్లు తుడిపిన రాళ్లు	: 6,384
ఒక్కోరాయికి ఖర్చు	: రూ.15
మొత్తం	: రూ.59,63,760
ఇప్పటివరకు తుడిపినది	: 6,384
గడువు తేదీ	: డిసెంబరు 31



ఉదయగిరి రూరల్ : సర్వే రాయిపై బొమ్మ, పేర్లను తొలగిస్తున్న సిబ్బంది

వేగంగా పేర్ల చెరిపివేత



జిల్లాలో సర్వే హద్దురాళ్లపై పేర్లు చెరిపివేసే కార్యక్రమాన్ని వేగంగా చేయిస్తున్నాం. జగన్ బొమ్మ, పేరు చెరిపివేత సందర్భంలో రాళ్లు దెబ్బతినకుండా శాండ్ పేపరుతో జాగ్రత్తగా తుడిపివేయిస్తున్నాం. ఈ ప్రక్రియను త్వరలో పూర్తి చేయిస్తాం.

- నాగశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే భూరికార్డులశాఖ

ఒక్కోరాయి రూ.180పైగానే..

సర్వే చేసిన పొలాల్లో పాతే రాళ్లపై కూడా నాటి సర్కారు భారీగా ఖర్చు చేసింది. ఒక్కో రాయికి రూ.180కిపైగా ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగి రూ.కోట్లు చేతులు మారినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.

నాటిన రాళ్లు 3.97 లక్షలు

జిల్లాలోని 328 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన ఈ గ్రామాల్లో 3,97,584 రాళ్లను నాటారు. చాలా రాళ్లు పాతకుండా నిరుపయోగంగా ఉన్నాయి. ఉలవపాడు మండలం మన్నేటి కోటలో వృథాగా ఉన్న ఎన్నో రాళ్లు కనిస్తున్నాయి.

గ్రామాల్లో డిజిటలైజేషన్

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని గ్రామాలన్నీ ఇకపై పూర్తిగా డిజిటలైజ్ కానున్నాయి. ఇప్పటి వరకు ఫైళ్లు, పరిపాలన పరమైన అంశాలను మాత్రమే ప్రభుత్వం డిజటలైజేషన్ చేయగా, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో నిధుల లేమితో అభివృద్ధిలేక పూర్తిగా గాడితప్పిన పంచాయతీ పాలనను గాడిన పెట్టడమేకాక డిజటలైజేషన్ ద్వారా పూర్తి సమాచారం ప్రజలు ఎప్పుడైనా, ఎక్కడైనా తెలుసుకు నేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు ప్రతి గ్రామాన్ని డిజటలైజేషన్ పరిధిలోకి తెచ్చే కసరత్తును ప్రారంభించారు.



డిజిటలైజేషన్ పనులు చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు

స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్

గ్రామాల్లో పాలనాపరమైన అంశాలే కాకుండా, ఆ గ్రామానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్వర్ణగ్రామ పంచాయతీ యాప్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ప్రతి గ్రామ వివరాలు అందులో పొందుపరి చేలా ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా, వాటి పరిధి లో 1938 గ్రామాలున్నాయి. వీటన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచు, పాలకవర్గ సభ్యులు, ఆ పంచాయతీలో ఉన్న గ్రామాలు, ఆ గ్రామాల విస్తీర్ణం, గృహాలు, జనాభా, మౌలిక సదుపా యాలు, కొళాయిలు, ఇంటిపన్నులు... ఇలా గ్రామానికి సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపరు స్తు న్నారు. గ్రామాలకు వచ్చే నిధులు, చేపడుతున్న పనుల వివరాలను సైతం ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలకు సంబంధించి పూర్తి వివరాలు యాప్‌లో ఉండనున్నాయన్నారు. ఆ పనులను ఈనెలాఖరుకల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది ఈ పనులను వేగంగా చేస్తున్నారు.

జడ్పీ సీఈవో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో)గా విద్యారమ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఈవోగా పనిచేసిన ఖాదర్‌బాషా విధులు నిర్వహించలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయిన విషయం విదితమే. దీంతో ఆయన్ను బదిలీచేసిన ప్రభుత్వం జిల్లాకు కొత్త సీఈవోగా విద్యారమను నియమిం చింది. ఆమె బాధ్యతల స్వీకరణ అనంతరం జడ్పీ చైర్ పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఈవోకు జడ్పీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో సీఈవో విద్యారమ

నిబద్ధతతో పని చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయడమే కాక ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఆ శాఖ ఆర్జేడీ లింగే శ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరు లోని రావూస్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఉన్నతాశయంతో విద్యాశాఖలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపార్ నమోదును వేగవంతం చేయాలని, ఏదైనా సమస్య లుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎఫ్ఏ-1, 2 పరీక్షల మార్కుల ఎంట్రీలను కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రమాణాలు తక్కువ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిని ప్రధాన పరీక్షలకు సంసిద్ధులను చేయాలని దిశా నిర్దేశం చేశారు. పీఎంశ్రీ స్కూల్స్‌కు వంద శాతం నిధులు వినియోగించాలని, పాల్ ల్యాబ్‌ను విద్యార్థులు నిత్యం గంటసేపు వినియోగించేలా చర్యలు తీసుకోవాల న్నారు. మధ్యాహ్న భోజనం సమయానికి సమీపంలోని అధికారులు కచ్చితంగా పాఠశాలలను సందర్శించాల న్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఈఈలు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు 3 రోజులే టైం



హెచ్చరిక బ్యానర్ చూపుతున్న రెవెన్యూ అధికారులు

నగరంలో అనేక మంది ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించనందున కార్పొరేషన్ అధికారులు వారికి వినూత్న రీతిలో హెచ్చరికలు పంపుతున్నారు. ఇందులో భాగంగా 47వ డివిజన్ 3వ సచివాలయం పరిధిలోని ములుముడి బస్టాండ్ వద్ద ఓ ఖాళీ స్థలానికి పన్ను వేయించుకోవాలని గురువారం బ్యానర్ పట్టుకుని వినూత్న రీతిలో సదరు యజమానికి హెచ్చరికలు పంపారు. స్థలం ముందు హెచ్చరికలతో కూడిన బ్యానర్ పట్టుకుని ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది నిలబడిఉండటం అందరిని ఆకర్షించింది. ఇవాల్టి నుంచి మూడు రోజుల్లో స్థల పత్రాలు తీసుకువచ్చి పన్ను వేయించుకోకపోతే పురపాలక చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

వచ్చేనెల 5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా పడ్డ సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ తిరిగి డిసెంబరు 5వ తేదీ ప్రారంభం కానుంది. 5వ తేదీన డబ్ల్యూఏలతోపాటు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎలక్షన్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. 8వ తేదీన డబ్ల్యూఏ (సాగునీటి సంఘాలు)లకు ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆ రోజే ఎన్నుకుంటారు. డిసెంబరు 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు, 14వ తేదీన ప్రాజెక్టు కమిటీల ఎన్నికతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించింది.

పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ టీకా వేయించాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు 4 నుంచి 8 నెలల వయసులోపు పెయ్యదూడలకు తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా వేయించాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువ్యాధి నియంత్రణ పథకం లో భాగంగా గురువారం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని పాడిరైతులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా టీకాలు వేస్తారని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కే రమేష్‌నాయక్, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ యం.నాగమణి, టీ సోమయ్య, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ డాక్టర్ చైతన్యకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కంపు నుంచి విముక్తి ఎన్నటికో!?





వంతెనపై రైలు వెళుతుండటంతో ఆగిన వాహనాలు

హరనాథపురం-వీఆర్సీ మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రయాణం అంటే చాలు నగరవాసులు హడలిపోతున్నారు. మురుగునీరంతా బ్రిడ్జి దిగువ నిలబడిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాక బ్రిడ్జిపై రైలుపట్టాల కింద ఎటువంటి స్లాబు వేయలేదు. దీంతో రైలు వెళ్లే సమయంలో ప్రయాణికుల మలం, మూత్రం నేరుగా కింద పడుతుంది. అవి మీద పడకుండా రైలు వెళ్లే సమయంలో పాదచారులు, వాహనదారులు బ్రిడ్జిక అటుఇటు ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యతోపాటు రైలు పట్టాల కింద కాంక్రీట్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



మురుగు మీద పడకుండా...



బ్రిడ్జిలో వస్తున్న మురుగు నీరు



అబ్బా.. ఈ కంపు భరించలేం!

అంధుల్లో వెలుగులు నింపుతూ

అభాగ్యులను ఆదుకుంటూ..

- చిన్న అనుభవం పెద్ద ఆలోచనకు దర్పణం
- తెలుగురాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాల్లోనూ 'ఐకేర్ మిషన్' సేవలు



అనాథలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఐకేర్‌మిషన్ సభ్యులు

చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని..
ఓటమితో గెలుపే చెప్పెను నేనున్నానని...
నేనున్నానని... నీకేం కాదని...

అంటూ ఓ సినీ గేయ రచయిత రాసిన పాటకు సిసలైన అర్థం చెబుతూ వెలకట్టలేని సేవా కార్యక్రమాలు చేస్తూ అంధులు, అభాగ్యులు, అనాథల జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఐకేర్ మిషన్. 17 ఏళ్ల క్రితం ఓ విద్యార్థి మదిలో మెదిలిన ఆలోచనతో మొగ్గ తొడిగిన ఈ సేవా సంస్థ ప్రస్తుతం పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉద్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడ్డ 500మందికిపైగా సభ్యుల ఔదార్యంతో నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. జిల్లాలో మొదలైన సేవలను రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకూ విస్తరించి ఖర్చుకు వెనకాడకుండా పేదలకు సేవలందిస్తోంది.

- జలదంకి (ఆంధ్రజ్యోతి)

మండల కేంద్రమైన జలదంకికి చెందిన వడ్డే శ్రీనాథ్ రెడ్డి ఐకేర్ మిషన్ ఆవిర్భావానికి ఆద్యుడు. నెల్లూరులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న రోజుల్లో ఓ రోజు నెల్లూరు బస్టాండులో శ్రీనాథ్‌రెడ్డి ఉండగా ఓ అంధ బాలుడు 'సార్ మీ కళ్ళు ఓసారి ఇస్తారా?' అని అమాయకంగా అడిగాడు. ఆ బాలుడిని నిరుత్సాహ పరచకుండా ఎందుకు? అని ఎదురు ప్రశ్నించారు. ఇందుకు ఆ బాలుడు బదులిస్తూ 'మా అమ్మ నన్ను ఎర్రోడా..' అని పిలుస్తోంది. ఆ ఎరుపు ఎలా ఉంటుందో చూడా లని ఉంది సార్ అని అడి గాడు ఆ అంధ బాలుడు. బాలుడి సమా ధానం విన్న శ్రీనాథ్‌రెడ్డి మనసు చలించింది. అప్పుడు ఆయన మదిలో ఒక ఆలోచన వచ్చింది. ఆ అంధ విద్యార్థితోపాటు తన లాంటి అంధులకు కంటి చూపు ప్రసాదించడానికి తాను ఏదైనా చేయాలను కున్నాడు. వెంటనే జరిగిన విషయాన్ని తన మిత్రులు దినేష్, భరత్, ప్రశాంత్, సాజిద్, ప్రభాకర్, సాయిచందులతో పంచుకుని తన ఆలోచననూ వివరించారు. వారు కూడా ఇందుకు సమ్మతించి, చేతులు కలిపారు.

17 ఏళ్ల క్రితం



అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తూ..

2007, డిసెంబరు 18న ఐకేర్‌మిషన్ పేరుతో సేవా సంస్థను ప్రారంభించారు. చదువుకుంటూనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన శ్రీనాథ్ రెడ్డి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగంలో ఉన్నారు. ఈయన స్నేహితులు కూడా ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. మిత్రులందరూ ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను పలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ సేవలను చూసి మరికొందరు ఉద్యోగులు, వ్యాపారులు సభ్యులుగా చేరారు. అలా ప్రస్తుతం ఐకేర్ మిషన్‌లో 500మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరంతా ప్రతి నెలా వారి సంపాదనలో 5, 10 శాతం సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. మరికొందరు పరోక్షంగా ఈ సంస్థ కార్యకలాపాలకు సహకరిస్తున్నారు.



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ నుంచి అవార్డు అందుకుంటూ..

సేవా కార్యక్రమాలు ఇవే

అంధుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఆవిర్భవించిన ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో తరచూ నేత్రదానంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నారు. అలా ఇప్పటి వరకు 400 మంది చేత నేత్రదానం చేసేందుకు అంగీకార పత్రంపై సంతకాలు తీసుకున్నారు.

- సంస్థ 17 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక మంది అంధులకు కంటిచూపు ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.
- దొరవారిసత్రంలో అంధులైన అన్నదమ్ములకు ఆర్థిక సాయం కొనసాగిస్తున్నారు.
- పాఠశాలల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటిఅద్దాలు పంపిణీ చేస్తున్నారు.
- అనంతపురం జిల్లాకు చెందిన బి.పద్మజ అనే మహిళకు కిడ్నీ, లివర్ వైద్యం కోసం రూ.2.05 లక్షలు ఆర్థికసాయం అందించారు. గుండెవ్యాధితో బాధపడుతున్న మహిళ రోషిణికి రూ.50వేలు అందజేశారు.
- 2017, ఫిబ్రవరిలో నెల్లూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల నగదు అందజేశారు.
- జలదంకి గిరిజన కాలనీలోని ఇద్దరు అనాథపిల్లలకు ప్రతి ఏడాది రూ.10 వేల వంతున విద్యా అవసరాలకు సాయం అందజేస్తున్నారు. వారికి 18 ఏళ్ళు నిండేవరకు ఈ సాయం కొనసాగుతుందని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. వీరికేగాక గ్రామాలలోని అనాథ పిల్లలను గుర్తించి, చదివిస్తున్నారు.
- అనాథలు, అంధులకు ఖర్చుల నిమిత్తం నగదు చెక్కులు అందజేశారు.
- పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం విద్యా పరికరాలు అందజేస్తున్నారు.
- పోలియో వ్యాధి సోకి నడవలేని స్థితిలో ఉన్న చిన్నారులకు మూడు చక్రాల కుర్చీలు అందించారు.
- కావలి, నెల్లూరు, జలదంకి తదితర పట్టణాలు, గ్రామాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆపదలో ఉన్నవారికి అవసరమైన రక్తాన్ని అందిస్తున్నారు.
- ఈ సంస్థ సేవలను గుర్తించి 2014లో అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేశారు.
- వర్ష, చలికాలాలలో రోడ్లపక్కన రాత్రిపూట దుకాణాల మెట్లపైన నిద్రించే యాచకులు, అనాథలు, అభాగ్యులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు నేత్రదానం, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నరసింహన్ నుంచి ఉత్తమ రక్తసేకరణ అవార్డు అందుకుంటున్న శ్రీనాథ్‌రెడ్డి

మా సేవలను మరింత విస్తరిస్తాం

17 ఏళ్ల క్రితం నెల్లూరులో మొదలైన ఐకేర్‌మిషన్ సేవలు కర్నూలు, హైదరాబాద్, చిత్తూరు, బెంగళూరు, పూణె, కోల్‌కతా తదితర మహా నగరాలకు విస్తరింపజేసి అక్కడి అంధులు, అనాథలు, నిరుపేదలకు సేవ చేస్తున్నాం. దేశవ్యాప్తంగా అనేక మంది అంధులకు నేత్రదానాలు చేసి చూపు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అనాథలకు, నిరుపేదలు, పేద విద్యార్థుల సంక్షేమానికి ఖర్చుకు వెనకాడకుండా మా సంస్థ సభ్యులంతా ముందుకు వస్తున్నారు. భవిష్యత్తులో మా ఐకేర్ మిషన్ సేవలను మరింత విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

- వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ఐకేర్ మిషన్ వ్యవస్థాపకుడు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి



నూతన బస్సులను ప్రారంభిస్తున్న సురేష్ రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ప్రజా రవాణా వ్యవస్థ పటిష్ఠతను పెంచేలా కృషి చేస్తామని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యమని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులపై ఎలాంటి వేధింపులు, కక్ష సాధింపు చర్యలు ఉండవని, అందరం కలిసి ఆర్టీసీ పటిష్ఠతను పెంచాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లలో ఆర్టీసీని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రోడ్లపై భారీ గుంతలతో బస్సులు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ సురేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొనడం చూస్తుంటే ప్రజల్లో ఆయనకున్న ఆదరణ స్పష్టమవుతోందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సురేష్‌రెడ్డితో సోదర భావంతో మెలిగానని చెప్పారు. కాగా, సురేష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ సందర్భంగా వీఆర్సీ సెంటర్ నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నెల్లూరు డివిజన్‌కు కేటాయించిన ఐదు కొత్త బస్సులను సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సురేంద్రరెడ్డి, ఆంజనేయులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మిడతల రమేష్, డిప్యూటీ మేయర్ రూపకుమార్ యాదవ్, జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజు వస్తే ఒట్టు!

- గుండ్లపాళెం సచివాలయంలో కానరాని వీఆర్వో



నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయ పరిధిలోని గుండ్లపాళెంలో ఉన్న 17/3 సచివాలయం వీఆర్వో ఒక్క రోజు కూడా విధులకు హాజరు కావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయానికి రాకపోవడమేకాదు కనీసం ఫోన్‌లోనూ అందుబాటులో ఉండరనే విమర్శ ఉంది. గురువారం మధ్యాహ్నం కూడా సచివా లయంలో ఆయన కుర్చీ ఖాళీగా దర్శనమివ్వడం గమనార్హం. ఆ వీఆర్వో తీరుతో తమ పనులు ఒక్కటీ కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కలెక్టరేట్‌లో చెప్పాలని అక్కడి అధికారులు సలహా ఇచ్చారంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు లాజరస్‌ను వివరణ కోరగా తాను విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సదరు వీఆర్వో ప్రోటోకాల్ డ్యూటీలో ఉన్నట్లు వివరించారు.

ట్రాన్స్‌'ఫార్మర్ల' కష్టాలు

- వర్షాలకు కాలిపోతున్న నియంత్రికలు
- మరమ్మతు చేయడంలో అంతులేని అలసత్వం
- రోజుల తరబడి ఎదురుచూపులు
- నీరందక ఎండిపోతున్న పైరు
- రైతులపై రవాణా భారం



ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉదయగిరి మండలం వీరారెడ్డిపల్లి రైతులకు సంబంధించినది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద జొన్న పంట సాగులో ఉంది. అయితే, నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురవడంతో పైరు ఎండిపోతోంది. నెల రోజులుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు.

ఉదయగిరి మండలంలోని గండిపాళెం, గుడినరవ, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఆయా గ్రామాల రైతులు పంటలు ఎండిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయాలని అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగాక మరమ్మతులు చేసి ఇచ్చారు. ఇందుకుగాను ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రవాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.8 వేల నుంచి 10 వేలు ఖర్చయినట్లు రైతులు తెలిపారు.

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకునేందుకు రైతులు, వినియోగదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మరొకటి ఏర్పాటు చేయాలి. అయితే, క్షేత్రస్థాయిలో అధికారులు, ఉద్యోగులు ఆ దిశగా స్పందించడంలేదన్న విమర్శలు ఉన్నాయి. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రోజుల తరబడి మార్చడంలేదని రైతులు వాపోతున్నారు.

కాలిపోతున్నాయ్!

ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు వందల సంఖ్యలో కాలిపోయాయి. ఒక్క ఉదయగిరి సబ్ డివిజన్‌లోని సుమారు 120 ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. ఇక ఆత్మకూరు, కావలి సబ్, కలిగిరి సబ్ డివిజన్లలో చెప్పాల్సిన అవసరం లేదు. ఆయా డివిజన్ల రైతులు సమస్యను ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారులతో చర్చించి ఇతర జిల్లాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించినా సమస్య పరిష్కారం కావడంలేదు.

ఉదయగిరి, ఆత్మకూరు సబ్ డివిజన్లకు కలిపి ఆత్మకూరు పట్టణం, నెల్లూరు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం ఉంది. ఇక్కడ రోజుకు 3-4 ట్రాన్స్‌ఫార్మర్లకే మరమ్మతులు చేసే వీలుంది. దీంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసినా మరలా కాలిపోతుండటంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల కింద సాగులో ఉన్న పంటలు నీరు లేక ఎండుముఖం పడుతుండటంతో రైతులు సంబంధిత అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఖర్చులు తడిసిమోపెడు

విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులే సొంత నగదు పెట్టుకుని మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను తరలించేందుకు ప్రతి డివిజన్‌లో ప్రత్యేక వాహనం ఉండాలి. ఆ వాహనాల్లో విద్యుత్ సిబ్బంది తీసుకొచ్చి, వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలి. అయితే ఉదయగిరి సబ్ డివిజన్‌కు వాహనం లేదు. దీంతో రైతులే ట్రాక్టర్లు, ప్రైవేటు వాహనాల్లో ఆత్మకూరుకు ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నారు. దీంతో రైతులకు రవాణా, ఇతరత్రా ఖర్చులు కలిపి సుమారు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.10వేల నుంచి 15 వేల వరకు ఖర్చు అవుతోంది. గతంలో సబ్ డివిజన్ కేంద్రంలో అదనంగా 10-20 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవి. కాలిపోయిన వెంటనే మార్పు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది.



మరమ్మతులు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న శకునాలపల్లి రైతులు

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోయాయి. నెల్లూరుపాళెంలో ఉన్న మరమ్మతుల కేంద్రంలో రోజుకు 3-4 మాత్రమే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత దృష్ట్యా వారు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొచ్చారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతోంది.

- ఐ.శ్రీనివాసులు, ట్రాన్స్‌కో డీఈ, ఆత్మకూరు

నెల రోజులుగా తిరుగుతున్నా



మా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నెల రోజుల క్రితం కాలిపోయింది. నీరు అందక జొన్న, వరి పంట లు ఎండిపో తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి ఇవ్వండని కరెంటు అధికారుల చుట్టూ నెలరోజులుగా తిరుగుతున్నా పట్టించుకొనేవారే కరువయ్యారు.

- లక్కు శ్రీనివాసులరెడ్డి, రైతు, వీరారెడ్డిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటిని మార్చాలని అధికారుల చుట్టూ నెలరోజులుగా ప్రదక్షిణలు చేయగా మంజూరు చేశారు. ఈ లోపు సాగులో ఉన్న పంట ఎండుముఖం పట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.తిమ్మయ్య, రైతు, శకునాలపల్లి

న్యూస్ బాక్స్

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర రావు

గుడ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చేపట్టిన డ్రైనేజి పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. కాలనీలో మురుగునీరు నిల్వ ఉండటం, చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వీటి బారినపడి విషజ్వరాలు వస్తున్నట్లు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాలకీర్తి శంకర్, జనసేన నాయకులు అన్నంగి చలపతి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మి

చేజర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీపై ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు అందజేయనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మీ తెలియజేశారు. గురువారం చేజర్లలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సూక్ష్మ సేద్యం, ఉద్యానవన పథకాల గురించి వివరించారు. బిందు, తుంపర్ల సేద్యంపై రైతులను ప్రోత్సహించి, వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ పనుల ప్రారంభం



గాంధీజన సంఘంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పల్లె పండుగలో భాగంగా ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ. 5 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులు మానికల కృష్ణమూర్తి, మాజీ సర్పంచు సుజాత, క్లస్టర్ ఇన్చార్జి బాణా శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు పాల్గొని భూమిపూజ చేసిన అనంతరం పనులు ప్రారంభించారు.

24న బ్రాహ్మణ వన సమారాధన

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్రాహ్మణసేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 24న నెల్లూరులోని కొండాయపాళెం గేట్ సుజాతమ్మ కాలనీ సమీపంలోని అష్టలక్ష్మి ఆలయం, శ్రీకృష్ణయోగ మందిరాల్లో కార్తీక దామోదర మహా రుద్రాభిషేకం, వన సమారాధన, సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఉదయాద్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎస్వీఎస్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న రషీద్

ఉదయగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పేర్కొన్నారు. ఈనెల 11న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల్, హీనా, ప్రధానోపాధ్యాయుడు నాయబ్, ఎస్ఎంసీ చైర్మన్ కవిత, ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ నాయబ్, ఎస్ఎం బాషా, రంతుల్లా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

అనంతసాగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బోయళ్ల జనార్దన్‌రెడ్డి మాలదారులకు అన్నప్రసాదంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

వెంటాడుతున్న వర్షాభావం

- ఐదేళ్లుగా చెరువుల కింద సాగుకు నోచుకోని వరిపైరు
- నీరు లేక అడవిని తలపిస్తున్న చెరువులు
- ఈ ఏడాది కూడా పంటల సాగులేనట్లే..!

లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని ఐదేళ్ల నుంచి తీవ్ర వర్షాభావం వెంటాడుతుండటంతో సాగునీటి చెరువుల్లో నీరులేక ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఒక్క చినపవని చెరువు కింద మాత్రమే 750ఎకరాల్లో మాత్రమే మూడేళ్ల నుంచి వరి సాగు చేస్తున్నారు. చిన పవని చెరువుకు అరకొరగా కురిసిన వర్షపు నీటితో పాటు, రాళ్లపాడు ప్రాజెక్టు నీరు కూడా చేరుతోంది. దీంతో ఈ చెరువు కింద వరి పైరును సాగు చేస్తారు. మిగిలిన లింగసముద్రం కొత్త, పాత చెరువులు, మొగిలిచెర్ల, విశ్వనాథపురం, మేదరమెట్లపాలెం, పెదపవని, వీఆర్ కోట, చెరువుల కింద ఈ పంట సాగు చేయడం లేదు.

- చిల్లచెట్లతో నిండిన చెరువులు

చెరువుల లోపల, కట్టలపైన, చిల్లచెట్లు విపరీతంగా పెరిగాయి. దీనికితోడు తూముల షట్టర్లు, రాడ్లు తుప్పుపట్టాయి. అసలు ఈ షట్టర్లు, రాడ్లు ఉన్నాయో లేవో అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. అలాగే పంట కాలువలు కూడా పూడిపోయి, చిల్ల చెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. ఈ చెట్లకు వేలం వేసి వీటిని తొలగించాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో చినపవని మినహా మిగిలిన సాగు నీటిచెరువుల ఆయకట్టు పరిధిలోని సుమారు 1700ఎకరాల్లో వరి సాగుకు నోచుకోలేదు. దీంతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పశువులు కూడా పశుగ్రాసానికి పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. లింగ సముద్రం పాతచెరువు కట్ట అప్పుడప్పుడు కురిసే వర్షాలకు కోతకు గురి అవుతుంది. కట్టపై రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారుతోందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చిల్లచెట్లతో నిండిపోయిన లింగసముద్రం పాత చెరువు

దూడలకు వ్యాధి నివారణ టీకాలు

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెయ్యదూడలకు వచ్చే బ్రూసెల్లా వ్యాధి నివారణకు ఈ నెల 20నుండి డిసెంబరు 20వరకు టీకాలు వేయనున్నట్లు కలిగిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ బాబు తెలిపారు. 4నుండి 8నెలల వయసున్న పెయ్యదూడలకు ఒక్కసారి ఈ టీకా వేస్తే జీవితకాలం ఈసుకు (అబార్షన్) పోవు లక్షణం నుంచి వాటిని కాపాడుకోవచ్చన్నారు. ప్రతిపాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాల కుంభకోణంపై సీఐడీ విచారణ జరిపించాలి

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగనన్నకాలనీల పేరుతో కావలిలో సేకరించిన 192ఎకరాల భూ కుంభకోణంపై సీబీసీఐడీకి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే డిక్రిష్ణారెడ్డి గురువారం అసెంబ్లీ సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీలు ఏర్పాటు చేయదలచుకున్న ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే ముందస్తుగా రైతులను బెదిరించి వారివద్ద నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేశారన్నారు. ఎకరా రూ.13లక్షలకు తన డ్రైవర్లు, ఇంట్లో పని చేస్తున్న వారి పేర్ల మీద కొనుగోలు చేసి వారికి తమ కుటుంబసభ్యుల అకౌంట్ల నుంచి నగదు జమ చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. దాన్ని ప్రభుత్వానికి రూ.50లక్షలకు విక్రయించి ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశారన్నారు. ఈ వ్యవహారాన్ని అప్పటి కలెక్టర్ అడ్డుకోవటంతో ఆయన్ను బదిలీ చేయించారన్నారు. 11అడుగుల ఎత్తున్న ప్రాంత గ్రావెల్‌ను అక్రమంగా అక్కడ నుంచి మరొక ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని చెప్పారు. మొత్తం 8,779ఇళ్లలో 1,560మాత్రమే నిర్మాణం పూర్తి చేశారని వాటిల్లో 15మంది మాత్రమే చేరినట్లు తెలిపారు.

సోమశిలకు 5,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 5,649 ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.837 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

భూముల ఆక్రమణలపై నివేదిక అందచేయాలి : ఆర్డీవో

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 21: మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆత్మకూరు ఆర్డీవో పావని స్పందించారు. ఆమె గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సచివాలయ సర్వేయర్‌లతో సమావేశం ఏర్పాటుచేసి, ప్రతీ రెవెన్యూలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి నివేదిక తయారుచేసి వారంరోజుల్లో తమకు అందజేయాలని ఆదేశించారు. ప్రధానంగా పొంగూరు, ఇర్లపాడు, అల్లంపాడు, చుంచులూరు, కదిరినేనిపల్లి, బ్రాహ్మణపల్లి రెవెన్యూల్లో అక్రమార్కులు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం పొంగూరు రెవెన్యూలో భూఆక్రమణ జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా అక్కడ పట్టాదారుడు తమ భూమిని చదును చేసుకుంటుండడంతో తప్పుడు ఫిర్యాదుగా నిర్ధారించుకొని వెళ్లారు. ఆమె వెంట ఆర్ఐ సాయికిరణ్, వీఆర్వోలు ఉన్నారు.



పొంగూరు గ్రామంలో భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో పావని

అటవీ భూముల జామాయిల్ కర్ర అంచనాల్లో భారీ వ్యత్యాసం

- పారదర్శక అంచనాలతో తిరిగి టెండర్లు పిలవాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీభూముల్లో జామాయిల్ కర్ర విక్రయాల కోసం ఇటీవల పిలిచిన టెండర్లులో కర్ర అంచనాలో అధికారులు భారీవ్యత్యాసాలు చూపించారని ప్రత్యేకఅధికార బృందాలతో అంచనాలు వేయించి తిరిగి టెండర్లు పిలవాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. గురువారం మండలిలో మంత్రి పవన్‌కల్యాణ్ ఉన్న సమయంలో మాధవరావు అటవీ టెండర్ల గురించి మాట్లాడారు. జిల్లాలో 3,669 హెక్టార్లలో 1.2లక్షల మెట్రిక్ టన్నుల జామాయిల్ కర్ర ఉందని అంచనా వేసి టెండర్లు పిలిచారని, వాస్తవానికి అటవీభూముల్లో 3.56 లక్షల టన్నుల కర్ర ఉందన్నారు. టన్నుకు రూ.8,100 ధర వేయటం ఎంతో హేతుబద్ధంగా ఉందన్నారు. వాస్తవంగా ఉన్న కర్రలో మూడోవంతు మాత్రమే చూయించటంతో రూ.200కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. 3,669 హెక్టార్లలో 560హెక్టార్లు అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచినవి కాగా మిగిలినవన్నీ వనసంరక్షణ సమితుల ద్వారా స్థానిక పేదరైతులు, గిరిజనులు పెంచుకున్నవని తెలిపారు. ఈ భూముల్లో వచ్చే కర్రలో సగం రైతులకు సగం అటవీశాఖకు చెందుతుందన్నారు. జామాయిల్ కర్ర అంచనాల్లో చేతివాటం చూపించడం వలన పెంచుకున్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సమగ్ర విచారణ జరిపి వాస్తవిక అంచనాలు వేసిన తర్వాత తిరిగి టెండర్లు పిలవాలని కోరారు. మంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకోవటం జరుగుతుందని సమాధానమిచ్చారని ఆయన తెలిపారు.

రోడ్డు మార్జిన్ స్థలం ఆక్రమణ

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ చర్చి వద్ద ఉన్న రోడ్డుమార్జిన్‌ను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. చర్చి నుంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లేమార్గంలో రోడ్డుమార్జిన్‌లో అక్రమంగా షాపులు నిర్మించేందుకు గురువారం ఆగమేఘాలమీద పనులు చేయిస్తున్నారు. మూడేళ్లక్రితం ఈ ప్రదేశంలో అక్రమ నిర్మాణం కోసం టౌన్‌చర్చి పెద్దలు ప్రయత్నాలు చేయగా ఆంధ్రజ్యోతి అక్రమ నిర్మాణాన్ని వెలుగులోకి తేవటంతో మున్సిపల్ అధికారులు పనులు నిలిపివేయించి అప్పటికే వేసిన పునాదులను తొలగింపజేశారు. అయితే ప్రస్తుతం మరోసారి చర్చి పెద్దలు ఆ ప్రయత్నాన్ని ప్రారంభించారు. అప్పట్లో రాత్రివేళ పునాది వేయగా ప్రస్తుతం పట్టపగలే నిర్మాణానికి తెగబడటం విశేషం. ఓవీ రోడ్డుకు చర్చి సెంటర్ నుంచి మార్కెట్‌కు వెళ్లే మార్గానికి కూడలిలో ఎంతో విలువైన రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తెగబడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గం అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగితే ప్రత్యామ్నా య మార్గంగా నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటోంది. ఈ పరిస్థితిలో చర్చి సెంటర్ నుంచి మార్కెట్‌సెంటర్ వరకు ఆక్రమణల తొలగింపు చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. ఈ తరుణంలో కూడలిలోనే ఆక్రమణకు తెగబడటం, అదీ ఓ ప్రార్థనాలయం ముందు షాపుల నిర్మాణం చేస్తుండటం తెగింపుకు పరాకాష్టగా పట్టణవాసులు విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణం గురించి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తక్షణం ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ, అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణస్వామి, కిరణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయం, డిగ్రీ కళాశాలలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు సునీల్ కుమార్, వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ ఏ నరసింహులు, విశ్రాంత గ్రంథాలయాధికారి ఫజులుల్లా, అధ్యాపకులు సోమశేఖర్, కేసీ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంగమాంబ పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీసేవ గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన నిర్వహించిన అనంతరం పల్లకీ సేవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి

- వెంకట శివకుమార్, ఎంఈవో-2



లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తున్నట్లు ఎంఈఓ-2 వెంకట శివకుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త విధానాలతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయు లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

? నూరు శాతం ఉత్తీర్ణతకు ఏమి చర్యలు చేపట్టారు.

! ప్రతిరోజూ సాయంత్రం అదనంగా ఒక గంట క్లాసు తీసుకుంటున్నారు. అలాగే ప్రతిరోజూ ఉపాధ్యాయులు మోడల్ పేపరు పరీక్ష పెడుతున్నాం. జనవరి 20 నుంచి 100రోజుల కార్యక్రమంలో విజయదీపిక అనే మోడల్ పేపర్ల పుస్తకంతో పరీక్షలు పెడతాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

? విద్యార్థుల డ్రాపౌట్లు తగ్గిందా.

! అన్ని పాఠశాలల్లో 4,426 మంది చదువుతున్నారు. డ్రా పౌట్స్ 410 మందిని గుర్తించాం. వారిని కొంతమందిని చేర్పిస్తాం

? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.

! యూనిఫామ్స్, బూట్లు, పుస్తకాలు విద్యార్థులందరికీ అందుతున్నాయి. అందని వారిని గుర్తించి వారికి అందజేస్తున్నాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా?

! మండలంలోని హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. అయితే పని సర్దుబాటు ద్వారా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

? మధ్యాహ్న భోజన పథకం ఎలా ఉంది?

! విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాము. ప్రతిరోజూ సిబ్బంది, హెచ్ఎంలు తనిఖీలు పరిశీలిస్తున్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



ఇళ్ల లబ్ధిదారులతో జనసైనికులు

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడులోని టిడ్కో ఇళ్లను గురువారం జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో లబ్ధిదారులు వారి సమస్యలను తెలిపారు. ఉచితంగా ఇళ్లు అనుకుంటే బ్యాంకు అధికారులు నెలవారీగా డబ్బులు కట్టమని నోటీసులు పంపుతున్నారని వాపోయారు. ఇళ్ల మంజూరు చేసినా రిజిస్టర్ చేసి తమకు ఇవ్వలేదని మరికొందరు చెప్పారు. టిడ్కో గృహ సముదాయానికి ప్రహరీ లేనందున తూర్పున ఉన్న చెరువు నీరు వర్షాకాలంలో గ్రౌండ్‌ఫ్లోర్ వద్దకు వస్తుందని చెప్పారు. రాత్రిళ్లు విషపురుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. సమస్యలను టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో జనసైని కులు తోకల వెంకటేశ్వరుల్లు, పాలడుగు వెంకటే శ్వరరావు, బెల్లంకొండ వెంకటే శ్వర్లు, షేక్ షమీ, కల్యాణ్, బాస్కర్, వినోద్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

వింజమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి సూచించారు. మండలంలోని బుక్కాపురం, ఏకిస్తీపురం, చింతలపాలెం గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని సూచించారు. సీసీ రోడ్లను, పశువుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రసూల్, ఉప సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు



బహుమతి ఇస్తున్న ప్రిన్సిపాల్ హుసేన్ పీరా

ఏఎస్ పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు సూచించారు. గురువారం ఆయన స్థానిక మోడల్ స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసర చన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హుసేన్ పీరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఉదయగిరి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో 2, 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇటీవల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యా లయం బాపట్లలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్‌తో పాటు అధ్యాపకులు గోపికృష్ణ, సునీత అభినందించారు.



విద్యార్థులతో అధ్యాపకులు

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరుపాళెం సెంటర్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి వరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏర్పాటుచేసిన వాటిలో పనిచేయని సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించడంతో పాటు నూతనంగా 30సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల్లోపు పట్టణంలో సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానవీధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణ ఆర్యవైశ్య అసోసియేషన్ వారు రూ. 50 వేలు అందించారని తెలిపారు. అలాగే ఆత్మకూరు సర్కిల్ పరిధిలో బెల్టుషాపుల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జిలాని, సీసీ కెమెరాల టెక్నీషియన్ మన్సూర్ పాల్గొన్నారు.

కుక్కల గుంపులపై ప్రజల ఆందోళన

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వందల సంఖ్యలో కుక్కలు మందలుగా తిరుగుతున్నా పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోక పోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కొత్తూరు ప్రాంతం, సాయిబాబా మందిరం, బస్‌స్టేషన్, హెచ్‌పీ పెట్రోల్ ప్రాంతాల వద్ద కుక్కలు గుంపులుగా తిరుగాడుతూ మనుషులపై దాడికి యత్నిస్తున్నాయని, ఐదేళ్లుగా కుక్కల నిర్మూలన చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. వారంరోజుల కిందట చిన్నారులను పాఠశాలలో వదిలిరావడానికి వెళ్లిన మహిళపై 10కిపైగా కుక్కలగుంపు వచ్చేసరికి ఆమె పిల్లలతో ఆలయంలోకి పరుగులు తీసింది. బుధవారం ఓ చిన్నారి బాలుడు హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా కుక్కల మంద దాడికి ప్రయత్నించగా స్థానికులు స్పందించడంతో ప్రమాదం తప్పింది. రాత్రి అయితే కాలనీల్లో తిరగలేక పోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి కుక్కలనిర్మూలనకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



సాయిబాబా మందిరం వద్ద సంచరిస్తున్న కుక్కలగుంపు

నివాసమున్న చోటే ఓటుహక్కు ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులు నివాసమున్న వార్డుల్లోని పోలింగ్ కేంద్రంలోనే ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురు వారం కమిషనర్ చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో బీఎల్వోలు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల, సవరణల కోసం ఇంటింటికి తిరుగుతున్నారని చెప్పారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్లు లేని వారు కొత్త ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా, ఓటు షిఫ్టింగ్ చేసుకునే వారు ఫారం-8 ద్వారా చేసుకోవచ్చన్నారు. మీ ఇళ్లకు వచ్చే బీఎల్వోల సహకరించి మీరు నివాసం ఉన్న ఇంటిలో ఓటు ఉండేలా చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీలోపు మాత్రమే అవకాశం ఉందన్నారు. జియో ట్యాగింగ్, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేసేందుకు సచివాలయ సిబ్బంది మీ ఇళ్లకు వస్తున్నారని వారికి సహకరిం చాలన్నారు. మీరున్న చోటనే ఓటు ఉండటమే కాక బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, జియో టాగింగ్‌లు ఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు అందుతాయన్నారు.